RNI : APTEL/2023/87662

# సింధూర దర్శిని

జాతీయ తెలుగు దినపత్రిక

ప్రతి అక్షరం అవినీతి పై సమరం

WWW.SINDHURADARSINI.COM WWW.EPAPER.SINDHURADARSINI.COM



3 లో కాణిపాకంలో 8 లక్షల 5వేలు పలికిన గణపయ్య లడ్డు

**విలేకరులు కావలెను**

సింధూరదర్శిని జాతీయ తెలుగు దినపత్రికలో జిల్లాల వారీగా పనిచేయుటకు జిల్లా ఇన్చార్జీలు మరియు మండలాల వారీగా పనిచేయుటకు విలేకరులు కావలెను. ఎలాంటి వేతనం ఇవ్వబడదు. యాడ్స్ పై ఆకర్షణీయమైన కమిషన్ ఇవ్వబడును. అనుభవం ఉన్న వారికి ప్రాధాన్యత ఇవ్వబడును. వివరాల కొరకు బయోడేటాతో క్రింది నంబర్‌ను సంప్రదించండి.

సెల్ నెంబర్ : 7569677170

ప్రచురణ: తిరుపతి సంపుటి:3 సంచిక :310 | సంపాదకులు: కలిచేటి వెంకయ్య | మంగళవారం 6 అక్టోబర్ 2026 | పేజీలు: 8 | వెల:2

Circulated At :Tirupathi, Chittoor, Kadapa, SPSR Nellore, karnool, Prakasam, Hydrabad




# పార్టీ కాదు.. ప్రాంతం కాదు.. ప్రజలే ముఖ్యం

తాగు నీటి విషయంలో రాజకీయాలకు తావు లేదు

ప్రతి ఇంటికీ సురక్షిత నీరు.. ప్రతి గ్రామానికి నీటి భద్రతే అమరజీవి జలధార లక్ష్యం

రూ.30,156 కోట్లతో 'అమరజీవి జలధార'కు శ్రీకారం

పులివెందులకు రూ.280 కోట్లుతో 299 గ్రామాల తాగు నీటి సమస్యకు పరిష్కారం

3.27 కోట్ల మందికి సురక్షిత తాగునీరు అందించేలా భారీ ప్రణాళిక

గత ఏడు దశాబ్దాల్లో నిర్మించిన వసతులకు మించి ఈ ఐదేళ్లలోనే భారీ నీటి మౌలిక వసతులు

రాయలసీమ నుంచి ఉద్దానం వరకు ప్రతి ప్రాంతానికీ సురక్షిత తాగునీరు

ప్రొద్దుటూరులో జల్ జీవన్ మిషన్ - అమరజీవి జలధార ప్రాజెక్టుల శంకుస్థాపన కార్యక్రమంలో చంద్రబాబు, పవన్

ప్రొద్దుటూరు, సింధూరదర్శిని:
తాగు నీటి విషయంలో రాజకీయాలకు తావు లేదని, అభివృద్ధి విషయంలో ప్రాంతం, పార్టీ అనే తేడా లేకుండా ప్రజలందరికీ సమాన ప్రాధాన్యత ఇవ్వడమే కూటమి ప్రభుత్వ విధానమని ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ అన్నారు. ప్రజలు ఏ ప్రాంతానికి చెందిన వారైనా, ఏ పార్టీకి మద్దతు ఇచ్చినా వారి సమస్యలను పరిష్కరించడం ప్రభుత్వ బాధ్యతని స్పష్టం చేశారు. ప్రతి ఇంటికీ సురక్షితమైన తాగు నీరు, ప్రతి గ్రామానికి నీటి భద్రత కల్పించడమే 'అమరజీవి జలధార' లక్ష్యమని తెలిపారు. సోమవారం కడప జిల్లా ప్రొద్దుటూరులో నిర్వహించిన జల్ జీవన్ మిషన్ - అమరజీవి జలధార ప్రాజెక్టుల శంకుస్థాపన కార్యక్రమంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడితో కలిసి రూ.30,156 కోట్ల విలువైన తాగునీటి పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా పవన్ కళ్యాణ్ మాట్లాడుతూ "శ్రీరామచంద్రుని పాదస్పర్శతో పునీతమైన నేల. మహాత్మా గాంధీ నడయాడిన నేల. తెలుగు సాహిత్యాన్ని తన అక్షరాలతో సుసంపన్నం చేసిన సరస్వతీపుత్ర పుట్టపర్తి నారాయణాచార్యులకు జన్మనిచ్చిన నేల ప్రొద్దుటూరు. బంగారం, వస్త్ర వ్యాపారంలో మినీ ముంబైగా, దసరా ఉత్సవాల్లో రెండో మైసూరుగా ప్రొద్దుటూరుకు ప్రత్యేక గుర్తింపు ఉంది. రూ.30,156 కోట్లతో భారీ తాగు నీటి ప్రణాళిక రాష్ట్రంలో తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపే లక్ష్యంతో రూ.30,156 కోట్లతో 50,315పనులను శ్రీకారం చుడుతున్నాం. 24,601 ఆవాసాల్లో ఇప్పటికే ఉన్న 61.60 లక్షల కుళాయి కనెక్షన్ల సామర్థ్యాన్ని పెంచి స్థిరీకరించడంతో పాటు, మరో 27.36లక్షల కొత్తకుళాయి కనెక్షన్లను అందిస్తున్నాం. మొత్తంగా 3.27 కోట్ల మంది ప్రజలకు సురక్షితమైన తాగు నీరు అందేలా కార్యాచరణ రూపొందించి అమలు చేస్తున్నాం. ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ గారు ప్రారంభించిన 'హర్ ఘర్ జల్' జల్ జీవన్ మిషన్‌కు గత ప్రభుత్వం తగిన ప్రాధాన్యత ఇవ్వలేదు. 2019-24మధ్య కేంద్రం ఆంధ్రప్రదేశ్‌కు దాదాపు రూ.26 వేల కోట్లు అందించినప్పటికీ, గత ఐదేళ్లలో రూ.2,700 కోట్లు మాత్రమే ఖర్చు చేసి, అక్కడక్కడ పైపులైన్లు, చిన్నచిన్న పనులు చేసి వదిలేశారు. 2024తో పథకం గడువు ముగుస్తుందని, నిధులు వెనక్కి వెళ్లే పరిస్థితి వస్తుందని, ప్రజల తాగునీటి కష్టాలు ఎప్పటికీ తీరవని తెలిసినా మిగతా 2లో...

## భారత్-అమెరికా వాణిజ్య చర్చలపై నిర్మలా సీతారామన్ కీలక వ్యాఖ్యలు

భారత్-అమెరికా వాణిజ్య చర్చల్లో స్తబ్దత ఏర్పడిందన్న నిర్మలా సీతారామన్

ప్రస్తుతం వాణిజ్యం భారత్‌కే అనుకూలంగా ఉందని వెల్లడి

వాణిజ్య లోటును తగ్గించుకోవాలని అమెరికా భావిస్తోందని వ్యాఖ్య

ఈయూ ఒప్పందాన్ని విజయవంతమైన ఉదాహరణగా చూపిన ఆర్థిక మంత్రి



**న్యూఢిల్లీ:** భారత్, అమెరికాల మధ్య కొంత కాలంగా కొనసాగుతున్న వాణిజ్య ఒప్పంద చర్చలు దాదాపుగా తుది దశకు చేరుకున్నప్పటికీ, ప్రస్తుతం అవి ప్రతిష్టంభనలో ఉన్నట్లు కనిపిస్తున్నాయని కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ పేర్కొన్నారు. ఇరు దేశాల మధ్య వాణిజ్యం ప్రస్తుతం భారత్‌కు అనుకూలంగా ఉండటంతో, ఆ లోటును తగ్గించుకోవడానికి అమెరికా తీవ్రంగా ప్రయత్నిస్తోందని ఆమె వెల్లడించారు. సోమవారం మిగతా 2లో...

## ఎన్నికల వ్యవస్థపై అవాస్తవ ప్రచారాలు సరికావు

రాష్ట్ర ఆరోగ్య శాఖ మంత్రి సత్య కుమార్ యాదవ్



న్యూఢిల్లీ: ఎన్నికల ప్రక్రియ, ఓటర్ల జాబితాల రూపకల్పన పూర్తిగా రాజ్యాంగ బద్ధంగా, అత్యంత పార దర్శకంగా జరుగుతాయని ఆంధ్ర ప్రదేశ్ ఆరోగ్య, కుటుంబ సంక్షేమ, వైద్యవిద్య శాఖా మంత్రి సత్య కుమార్ యాదవ్ స్పష్టం చేశారు. న్యూఢిల్లీలోని ఏపీ భవన్ గురజాడ కాన్ఫరెన్స్ హాల్లో జరిగిన విలేకరుల సమావేశంలో మంత్రి మాట్లాడుతూ ఎన్నికల నిర్వహణలో అనుసరిస్తున్న నిబంధనలు, సాంకేతిక పద్ధతులు, ఓటర్ల నమోదు ప్రక్రియపై కొందరు చేస్తున్న అవాస్తవ ఆరోపణలను ఆయన ఖండించారు. మిగతా 2లో...



## స్విట్జర్లాండ్‌తో ఏపీ బలమైన బంధం

పరిశ్రమల శాఖ మంత్రి టి.జి. భరత్ కీలక చర్చలు!

న్యూఢిల్లీ:ఆంధ్రప్రదేశ్‌లో పెట్టుబడుల వరద పారించే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం అడుగులు వేస్తోంది. ఇందులో భాగంగానే స్విట్జర్లాండ్‌తో ఆర్థిక, పారిశ్రామిక సంబంధాలను మరింత బలోపేతం చేసే దిశగా పరిశ్రమలు, వాణిజ్య శాఖా మంత్రి టి.జి. భరత్ న్యూఢిల్లీలో కీలక చర్చలు జరిపారు.

**ద్వైపాక్షిక చర్చలు, ప్రముఖుల భేటీ:**

స్విస్ కాన్ఫెడరేషన్ స్టేట్ సెక్రటరీ ఫర్ ఎకనామిక్ అఫైర్స్ హెలెనా బుడ్లిగర్ ఆర్టియడాతో మంత్రి భరత్ ద్వైపాక్షిక సమావేశం నిర్వహించారు. స్విస్ రాయబార కార్యాలయం ఆధ్వర్యంలో జరి గిన "ఏపీ-స్విట్జర్లాండ్ బిజినెస్ ఫోరమ్"లో స్విస్ ప్రభుత్వ ఉన్నతాధికారులు, పారిశ్రా మిక దిగ్గజాలు పాల్గొనగా.. మంత్రి వారికి ఏపీలో ఉన్న పెట్టుబడి అవకాశాలను వివరించారు.

**అభివృద్ధికి అగ్రపీఠం- ఆకర్షణీయ రంగాలు**

స్విస్ పారిశ్రామిక నైపుణ్యాలు, ఏపీ వృద్ధి లక్ష్యాలకు సరిగ్గా సరిపోతాయని మంత్రి పేర్కొన్నారు. అడ్వాన్స్డ్ మిగతా 2లో...

## 2029 నాటికి 4-స్టార్.. ప్రభుత్వ స్కూళ్లపై మంత్రి లోకేశ్ సమీక్ష

అధికారులకు కీలక ఆదేశాలు!

ఏడాదిలోగా వన్-స్టార్ స్కూళ్లను టూ-స్టార్‌గా మార్చాలని ఆదేశం

2029 నాటికి రాష్ట్రంలోని అన్ని పాఠశాలల్లో 4-స్టార్ సదుపాయాల కల్పన లక్ష్యం

ఈ ఏడాది 5లక్షల మంది విద్యార్థులకు నైపుణ్య శిక్షణ ఇవ్వాలని నిర్ణయం

ఏజెన్సీ ప్రాంత పాఠశాలల అభివృద్ధిపై ప్రత్యేకంగా దృష్టి సారించాలని సూచన



**అమరావతి సింధూరదర్శిని:**
ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయాల కల్పనకు ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని, ఈ విషయంలో నిర్దేశిత లక్ష్యాలను నిర్దేశిత గడువులోగా చేరుకోవాలని రాష్ట్ర ఐటీ, విద్య, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేశ్ అధికారులను ఆదేశించారు. పాఠశాలల్లో వసతుల కల్పన, నైపుణ్యాభివృద్ధి అంశాలపై సోమవారం ఉండవల్లిలోని తన నివాసంలో ఆయన ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి లోకేశ్ మాట్లాడుతూ.. ఏడాదిలోగా రాష్ట్రంలోని వన్-స్టార్ పాఠశాలలన్నింటినీ టూ-స్టార్ స్థాయికి అప్‌గ్రేడ్ చేయాలని స్పష్టం చేశారు. అలాగే, ప్రస్తుత విద్యా సంవత్సరంలోగా జీరో-స్టార్ రేటింగ్ ఉన్న పాఠశాలలన్నింటినీ కనీసం వన్-స్టార్ స్థాయికి చేర్చాలని సూచించారు. 2029 నాటికి రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలలను 4-స్టార్ ప్రమాణాలకు అనుగుణంగా అభివృద్ధి చేయాలని, కనీసం వెయ్యి పాఠశాలలను 5-స్టార్ స్థాయికి చేర్చేలా పటిష్ఠ ప్రణాళికలు రూపొందించాలని దిశానిర్దేశం చేశారు. ముఖ్యంగా ఏజెన్సీ, వెనుకబడిన ప్రాంతాల్లోని పాఠశాలల అభివృద్ధిపై ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. నియోజకవర్గానికి ఒకటి చొప్పున 175 "లీప్ స్కూళ్లను" అభివృద్ధి చేసేందుకు అవసరమైన కార్యాచరణ సిద్ధం చేయాలని కోరారు. ప్రస్తుతం రాష్ట్రంలో 1,685 వన్-స్టార్... 15,618 టూ-స్టార్... 19,099 త్రీ-స్టార్... 7,172 ఫోర్-స్టార్ పాఠశాలలు ఉన్నాయని అధికారులు మంత్రికి వివరించారు. పాఠశాలల్లో మౌలిక సదుపాయాల పురోగతిపై డీఈవోలు, ఎంఈవోలు, సీఆర్‌పీలకు మిగతా 2లో...



బ్రహ్మోత్సవాల విజయానికి కృషి చేసిన అందరికి ధన్యవాదాలు 2 లో

# 2029 నాటికి 4-స్టార్.. ప్రభుత్వ స్కూళ్లపై మంత్రి లోకేశ్ సమీక్ష

(మొదటిపేజీ తరువాయి)

బాధ్యతలు అప్పగించాలని లోకేశ్ సూచించారు. రాష్ట్రవ్యాప్తంగా 7 వేల హైస్కూళ్లలో పూర్తిస్థాయిలో కంప్యూటర్ ల్యాబ్స్, అటల్ టింకరింగ్ ల్యాబ్స్ ఏర్పాటుపై ప్రత్యేక దృష్టి సారించాలని కోరారు. అకడమిక్ సంస్కరణలు పూర్తయినందున, ఇకపై అధికారులు, ఉపాధ్యాయులు పూర్తిగా అభ్యసన ఫలితాల మెరుగుదలపైనే దృష్టి సారించాలని పిలుపునిచ్చారు.

**నైపుణ్యాభివృద్ధికి పెద్దపీట**

విద్యార్థులకు నైపుణ్య శిక్షణ అందించేందుకు కేంద్ర ప్రభుత్వ పథకాలను సమర్థవంతంగా వినియోగించుకోవాలని మంత్రి లోకేశ్ ఆదేశించారు. ప్రధానమంత్రి కౌశల్ వికాస్ యోజన (పీఎంకేవీవై) ద్వారా ఈ ఏడాది 5 లక్షల మంది విద్యార్థులకు నైపుణ్య శిక్షణ ఇవ్వాలని లక్ష్యంగా నిర్దేశించారు. ప్రధానమంత్రి ఇంటర్న్‌షిప్, నేషనల్ అప్రెంటిస్‌షిప్ స్కీమ్‌లను విద్యార్థులు సద్వినియోగం చేసుకునేలా ప్రోత్సహించాలని సూచించారు. నిరుద్యోగ యువతను "నైపుణ్యం పోర్టల్" పరిధిలోకి తీసుకువచ్చి, ఏఐ సాంకేతికత ద్వారా వారికి ఇంటర్వ్యూలు నిర్వహించాలన్నారు. సీడాప్, ఓంక్యాప్‌ల ద్వారా జర్మన్, జపనీస్ వంటి విదేశీ భాషల్లో శిక్షణనిచ్చి, విదేశాల్లో ఉపాధి అవకాశాలు కల్పించాలని అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో మానవ వనరుల శాఖ ముఖ్య కార్యదర్శి జె. శ్యామలరావు, ఇంటర్మీడియట్ విద్య కమిషనర్ రంజిత్ బాషా, రాష్ట్ర విద్యా మౌలిక సదుపాయాల సంస్థ ఎండీ దీవెన్‌రెడ్డి, స్కిల్ డెవలప్‌మెంట్ సీఈవో నారాయణస్వామి పాల్గొన్నారు.

## భారత్-అమెరికా వాణిజ్య చర్చలపై నిర్మలా సీతారామన్ కీలక వ్యాఖ్యలు

(మొదటిపేజీ తరువాయి)

ఢిల్లీలో నిర్వహించిన 'మ్యూనిచ్ లీడర్స్ మీటింగ్ 2026'లో ఆమె మాట్లాడారు. "వాణిజ్య ఒప్పందం కోసం ఇరు దేశాలు పట్టుదలగా చర్చలు జరిపాయి. ప్రస్తుతం ఇచ్చిపుచ్చుకునే ధోరణికి అతీతంగా చర్చలను ముందుకు తీసుకెళ్లడం కష్టతరంగా మారింది" అని ఆమె అభిప్రాయపడ్డారు. అయినప్పటికీ, ఈ చర్చలను మరింత ముందుకు తీసుకెళ్లే అవకాశాలను ఇరుపక్షాలు అన్వేషించవచ్చని సూచించారు. భారత్‌తో వాణిజ్యం వల్ల తమకు ఏళ్లుగా నష్టం జరుగుతోందన్న అమెరికా ఆందోళన ఈ చర్చల్లో స్పష్టంగా ప్రతిబింబిస్తోందని ఆమె తెలిపారు. ఫిబ్రవరి 2026లో ప్రకటించిన మధ్యంతర వాణిజ్య ఒప్పంద ముసాయిదా ప్రాతిపదికన ఈ చర్చలు కొనసాగుతున్నాయి. ఇదే క్రమంలో భారత్-యూరోపియన్ యూనియన్ (ఈయూ) మధ్య కుదిరిన వాణిజ్య ఒప్పందాన్ని ఆమె ఒక విజయవంతమైన ఉదాహరణగా పేర్కొన్నారు. యూరోపియన్ కమిషన్ ప్రెసిడెంట్ అభివర్ణించినట్లుగా ఇది 'తల్లి లాంటి ఒప్పందం' అని ఆమె కొనియాడారు. ఈ ఒప్పందంలో భాగంగా భారత్ 92.5 శాతం టారిఫ్ లైన్లను, 97 శాతం వాణిజ్య విలువను అందుబాటులోకి తెస్తే, ఈయూ తన వైపు నుంచి 97 శాతం టారిఫ్ లైన్లను, 99 శాతం వాణిజ్య విలువను విముక్తం చేసిందని ఆమె వివరించారు.

## ఎన్నికల వ్యవస్థపై అవాస్తవ ప్రచారాలు సరికావు

(మొదటిపేజీ తరువాయి)

ఎన్నికల సంఘం మరియు చట్టబద్ధమైన వ్యవస్థల ద్వారా జరిగే ఈ ప్రక్రియపై అపోహలు సృష్టించడం సరికాదని హితవు పలికారు. ఎస్.ఐ.ఆర్ తదితర నిరంతర ప్రక్రియలు పకడ్బందీగా జరుగుతున్నాయని, ప్రజాస్వామ్య వ్యవస్థల పట్ల ప్రజలకు ఉన్న నమ్మకాన్ని దెబ్బతీసేలా మాట్లాడటం తగదని మంత్రి పేర్కొన్నారు.

## స్విట్జర్లాండ్‌తో ఏపీ బలమైన బంధం

(మొదటిపేజీ తరువాయి)

మ్యానుఫ్యాక్చరింగ్, ప్రెసిషన్ ఇంజనీరింగ్, ఫార్మా, బయోటెక్, మెడ్‌టెక్, క్లీన్ ఎనర్జీ, మొబిలిటీ మరియు లాజిస్టిక్స్ రంగాలలో పెట్టుబడులకు రాష్ట్రం స్వర్గధామమని చెప్పారు. రాష్ట్రంలో "వేగం, స్థిరత్వం, సేవాభావం విధానంతో పాటు, ఏపీఈడీబీ ద్వారా పారిశ్రామికవేత్తలకు సింగిల్ డెస్క్ విధానంలో పూర్తి సహకారం అందిస్తున్నామని స్పష్టం చేశారు.

**టీపా ఒప్పందంతో భారీ అవకాశాలు:**

భారత్-ఇఎఫ్‌టిఎ వాణిజ్య ఒప్పందం (ఙజూూ) ద్వారా రానున్న 15 ఏళ్లలో 100 బిలియన్ డాలర్ల పెట్టుబడులు, 1 మిలియన్ ఉద్యోగాల లక్ష్య సాధనలో ఏపీ కీలక పాత్ర పోషిస్తుందని మంత్రి ధీమా వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు జూరిచ్, దావోస్ పర్యటనల స్ఫూర్తితో ఈ బంధం మరింత బలపడిందని గుర్తుచేశారు.

**విశాఖ సదస్సుకు స్విస్ కంపెనీలకు ఆహ్వానం:**

నవంబర్ 12-13 తేదీలలో విశాఖపట్నంలో జరగనున్న ప్రఖ్యాత సీఐఐ భాగస్వామ్య సదస్సు కు తరలిరావాల్సిందిగా స్విస్ పారిశ్రామిక వర్గాలను మంత్రి సాదరంగా ఆహ్వానించారు. పెట్టుబడిదారుల ఆసక్తిని క్షేత్రస్థాయి ప్రాజెక్టులుగా మార్చడమే లక్ష్యంగా ప్రభుత్వం దూసుకెళ్తోందని ఈ సందర్భంగా ఆయన ఉద్ఘాటించారు. ఈ సదస్సులో ఆంధ్రప్రదేశ్ భవన్ రెసిడెంట్ కమిషనర్ ప్రవీణ్ కుమార్ పాల్గొన్నారు.

# పార్టీ కాదు.. ప్రాంతం కాదు.. ప్రజలే ముఖ్యం









(మొదటిపేజీ తరువాయి)

కూడా పట్టించుకోలేదు. 2024లో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే, జల్ జీవన్ మిషన్‌ను కొనసాగించేందుకు గౌరవ ముఖ్యమంత్రి శ్రీ చంద్రబాబు నాయుడు గారు, నేను - గౌరవ ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ గారిని కలిసి విజ్ఞప్తి చేశాము. అలాగే, గౌరవ కేంద్ర జలశక్తి మంత్రివర్యులు శ్రీ సి.ఆర్. పాటిల్ గారు, గౌరవ కేంద్ర ఆర్థిక శాఖ మంత్రివర్యులు శ్రీమతి నిర్మలా సీతారామన్ గారి సహకారంతో జలజీవన్ మిషన్ పథకాన్ని 2028 వరకు పొడిగించుకుని, వెంటనే పనులు ప్రారంభించాం. ఇప్పటికే రూ.4,500 కోట్ల విలువైన పనులు పూర్తి చేశాము.

**గత మౌలిక వసతులకు భారీగా అదనపు సామర్థ్యం**

1953లో ఆంధ్ర రాష్ట్రం ఏర్పడినప్పటి నుంచి 2024 వరకు రాష్ట్రంలో తాగు నీటి మౌలిక వసతుల అభివృద్ధి క్రమంగా జరిగింది. ఈ కాలంలో 816 ఎం.ఎల్.డి సామర్థ్యం కలిగిన వాటర్ ట్రీట్‌మెంట్ ప్లాంట్లు, 1,072 ఓవర్ హెడ్ బ్యాలెన్స్ జలాశయాలు, 28,086 ఓవర్ హెడ్ నిల్వ జలాశయాలు, 1.18 లక్షల కిలోమీటర్ల మేర పైప్‌లైన్లు ఏర్పాటు చేయబడ్డాయి. అయితే, 'అమరజీవి జలధార' కార్యక్రమం ద్వారా కేవలం ఐదేళ్లలోనే ఈ మౌలిక వసతులకు భారీగా అదనపు సామర్థ్యాన్ని జోడిస్తున్నాం. ఇందులో భాగంగా 1,426 ఎం.ఎల్.డి సామర్థ్యం కలిగిన నీటి శుద్ధి కేంద్రాలు, 494 ఓవర్ హెడ్ బ్యాలెన్స్ జలాశయాలు, 13,075 ఓవర్ హెడ్ నిల్వ జలాశయాలు, 77 వేల కిలోమీటర్ల పైప్‌లైన్లను ఏర్పాటు చేస్తున్నాం. అంటే, గత ఏడు దశాబ్దాల్లో నిర్మించిన మౌలిక వసతులతో పోలిస్తే, కేవలం ఈ ఐదేళ్లలోనే 50 శాతం నుంచి 175 శాతం వరకు అదనపు సామర్థ్యాన్ని సృష్టిస్తున్నాం. రూ.9 వేల కోట్లతో 50,283 సింగిల్ విలేజ్ స్కీమ్స్, రెట్రోఫిట్టింగ్ పనులు, రూ.19,500 కోట్లతో 32 మల్టీ విలేజ్ స్కీమ్స్ చేపడుతున్నాం. నీటి నాణ్యత పర్యవేక్షణ కోసం రూ.1,624 కోట్లు కేటాయించాము.

ఉద్దానం నుంచి డోన్ వరకు, కర్నూలు నుంచి కుప్పం వరకు, గండికోట, పీఏబీఆర్, ఏలేరు, తాండవ, హిరమండలం, ధవళేశ్వరం తదితర జలాశయాల ఆధారంగా తాగు నీటి పథకాలను చేపడుతున్నాం. ఉద్దానం, ఏ.కొండూరు వంటి కిడ్నీ సమస్యలు అధికంగా ఉన్న ప్రాంతాలతో పాటు, రాయలసీమలోని కరువు ప్రభావిత ప్రాంతాలు, పులివెందుల, పుంగనూరు, పలమనేరు, గోదావరి ప్రాంతాల్లోని కాలుష్య ప్రభావిత ప్రాంతాలు, మార్కాపురం వంటి ఫ్లోరైడ్ ప్రభావిత ప్రాంతాల్లోనూ సురక్షితమైన తాగునీరు అందించడమే ప్రభుత్వ లక్ష్యం.

**నీటి నాణ్యతపై ప్రత్యేక దృష్టి**

నీటి వనరులకు కొరత లేని ఉమ్మడి గోదావరి జిల్లాల్లో కూడా తాగు నీటి భద్రతను దృష్టిలో పెట్టుకుని రూ.6 వేల కోట్లతో జల్ జీవన్ మిషన్ పనులు చేపట్టాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఆక్వా సాగు, పారిశ్రామిక కాలుష్యం కారణంగా కొన్ని ప్రాంతాల్లో భూగర్భ, ఉపరితల నీటి వనరులు కలుషితమవుతున్నాయి. అందుకే నీటి నమూనాలను ఎప్పటికప్పుడు సేకరించి పరీక్షిస్తున్నాం. కాలుష్యానికి కారణమవుతున్న ఆక్వా ప్రాసెసింగ్ యూనిట్లపై కఠిన చర్యలు తీసుకుంటూ షోకాజ్ నోటీసులు జారీ చేస్తున్నాం. అదే సమయంలో, తాగునీటి పథకాల్లో నీటి శుద్ధికి కీలకమైన ఫిల్టర్ బెడ్స్ నిర్వహణకు ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తున్నాం. ఇప్పటి వరకు రూ.35 కోట్లతో 340 ఫిల్టర్ బెడ్స్‌ను పునరుద్ధరించాం. మరో 552 ఫిల్టర్ బెడ్స్‌ను రూ.88 కోట్లతో పునరుద్ధరిస్తున్నాం. పంప్ హౌస్‌లు, రిజర్వాయర్లు, పైప్‌లైన్ల నిర్వహణతో పాటు నీటి నాణ్యతను నిరంతరం పర్యవేక్షించడం, ఇతర అవసరమైన సహాయక కార్యకలాపాల కోసం రూ.1,600 కోట్లు కేటాయించాం. నీటి శుద్ధి కేంద్రాలు, పంప్ హౌస్‌లలోని ఓపెనింగ్స్‌కు రక్షణ వలలు ఏర్పాటు చేసి బల్లులు, పురుగులు వంటి జీవులు లోపలికి ప్రవేశించకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించాం.

**తాళ్లమాపురానికి రూ.3.5 కోట్ల అభివృద్ధి పనులు**

ప్రొద్దుటూరు నియోజక వర్గంలోని తాళ్లమాపురం పంచాయతీ ప్రజలు గత ప్రభుత్వ హయాంలో తమ సమస్యల పరిష్కారం కోసం అనేక ఇబ్బందులు ఎదుర్కొన్నారని స్థానికులు చెబుతున్నారు. దాదాపు 6 వేల జనాభా ఉన్న ఈ గ్రామంలో రోడ్లు, తాగు నీరు వంటి కనీస మౌలిక వసతుల కోసం ప్రజలు పలుమార్లు వినతులు సమర్పించినా, తగిన స్పందన లభించలేదనే ఆవేదన ఉంది. సమస్యలను ప్రజాస్వామ్య పద్ధతిలో ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లేందుకు ప్రయత్నించిన యువత కూడా ఇబ్బందులు ఎదుర్కొన్న పరిస్థితులు ఉన్నాయి. ఇకపై ఇలాంటి పరిస్థితులకు తావులేకుండా తాళ్లమాపురం, సాగిలి గొడ్డుపల్లి, ములవారిపల్లి గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నాం. దాదాపు రూ.1.5 కోట్లతో రెండు కిలోమీటర్ల సీసీ రోడ్లు, మ్యాజిక్ డ్రెన్లు నిర్మించడంతో పాటు, మరో రూ.2 కోట్లతో 90 కిలోలీటర్ల సామర్థ్యం కలిగిన ఓవర్‌హెడ్ రిజర్వాయర్, నాలుగు కిలోమీటర్ల పైప్‌లైన్లు, ప్రత్యేక బోర్‌వెల్ ఏర్పాటు చేయనున్నాం. మొత్తం రూ.3.5 కోట్ల విలువైన ఈ పనులను తక్షణమే చేపట్టాలని అధికారులను ఆదేశిస్తున్నాను. ప్రజల సమస్యలను పరిష్కరించే విషయంలో కూటమి ప్రభుత్వం ప్రాంతం, పార్టీ అనే తేడా చూడదు. ప్రతి గ్రామానికి సమానంగా అభివృద్ధి ఫలాలు అందాలన్నదే మా లక్ష్యం. అందుకు నిదర్శనంగా పులివెందులలో అసంపూర్తిగా ఉన్న తాగునీటి పథకానికి రూ.280 కోట్లు కేటాయించి, ఏడు మండలాల్లోని 299 గ్రామాల తాగు నీటి సమస్యకు పరిష్కారం చూపించే చర్యలు చేపట్టాం. అదేవిధంగా అల్లూరి సీతారామరాజు జిల్లాలోని అరకు, పాడేరు నియోజకవర్గాల్లోనూ ఎలాంటి ప్రాంతీయ భేదాలు లేకుండా దాదాపు రూ.2,500 కోట్లతో 'పల్లె పండుగ', 'అడవితల్లి బాట' వంటి అభివృద్ధి పనులను చేపడుతున్నాం.

**కాంట్రాక్టర్లకు సకాలంలో బిల్లుల చెల్లింపు**

గత ప్రభుత్వ హయాంలో ఉపాధి హామీ, జల జీవన్ మిషన్ వంటి కార్యక్రమాల కింద పనులు చేపట్టిన చిన్న, మధ్యతరహా కాంట్రాక్టర్లకు బిల్లులు పెండింగ్‌లో ఉండిపోయాయి. దీంతో పనులు చేసిన కాంట్రాక్టర్లు ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఈ సమస్యపై ప్రత్యేక దృష్టి సారించాం. ఎఫ్.ఐ.ఎఫ్.ఓ. విధానంలో బిల్లులను సకాలంలో చెల్లిస్తూ, కాంట్రాక్టర్లకు ఆర్థిక భరోసా కల్పిస్తున్నాం. అదే విధంగా 15వ ఆర్థిక సంఘం నిధులను కూడా పంచాయతీలకు ఎప్పటికప్పుడు విడుదల చేస్తున్నాం. ఇప్పటి వరకు రూ.4,200 కోట్లను విడుదల చేశాం. పంచాయతీలకు నిధుల కొరత లేకుండా చూడటం, అభివృద్ధి పనులు నిరంతరాయంగా కొనసాగించడం, పనులు చేసిన వారికి సకాలంలో చెల్లింపులు చేయడం ద్వారా గ్రామీణ ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేస్తున్నాం" అన్నారు.

అంతకు ముందు వేదిక వద్ద ఏర్పాటు చేసిన ప్రత్యేక ర్యాంప్‌పై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు పీవీఎన్ మాధవ్ కలిసి నడుస్తూ సభకు తరలివచ్చిన ప్రజలకు అభివాదం చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర వెనుకబడిన తరగతుల సంక్షేమం, జౌళి శాఖ, జిల్లా ఇంఛార్జ్ మంత్రి ఎస్.సవిత, మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి పొంగూరు నారాయణ, రోడ్లు భవనాల శాఖ మంత్రి బీసీ జనార్ధనరెడ్డి, ప్రొద్దుటూరు శాసన సభ్యులు నంద్యాల వరదరాజులురెడ్డి, పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా శాఖల ముఖ్య కార్యదర్శి కాంతిలాల్ దండే, కడప జిల్లా కలెక్టర్ చెరుకూరి శ్రీధర్, పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి శాఖ కమిషనర్ కృష్ణ తేజ, గ్రామీణ నీటి సరఫరా విభాగం ఇ.ఎన్.సి. గాయత్రి దేవి, కూటమి పార్టీలకు చెందిన శాసన మండలి సభ్యులు, శాసన సభ్యులు, వివిధ కార్పోరేషన్ల చైర్మన్లు, నాయకులు పాల్గొన్నారు.

# గిరిజనులకు ఇంటి పట్టాలు పంపిణీ

**జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల - దశాబ్దాలుగా గుర్తింపునకు నోచుకోని చల్లా యానాదులకు అండగా నిలిచిన కలెక్టర్**



నెల్లూరు (సింధూర దర్శిని) 5 అక్టోబర్ నెల్లూరు జిల్లా ; కోవూరు సమీపంలోని సాలు చింతల వద్ద సుమారు 40 ఏళ్లుగా ఇటుక బట్టీల్లో పని చేసుకుంటూ ఎటువంటి గుర్తింపు లేకుండా నివసిస్తున్న చల్లా యానాది గిరిజన కుటుంబాలకు జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల అండగా నిలిచారు. గిరిజనుల సమస్యలను డాక్టర్ అంబేద్కర్ సొసైటీ ఫర్ యూత్ అండ్ రూరల్ డెవలప్మెంట్ స్వచ్ఛంద సంస్థ వ్యవస్థాపకులు బాల చెన్నయ్య కలెక్టర్ దృష్టికి తీసుకురావడంతో ఆయన సానుకూలంగా స్పందించారు. గిరిజన కుటుంబాలకు ప్రభుత్వం ద్వారా ఆధార్ కార్డులు, ఓటర్ కార్డులు, రేషన్ కార్డులు అందేలా చర్యలు చేపట్టారు. ఇందులో భాగంగా కోవూరు హైవే సమీపంలోని నందలగుంట వద్ద 30 మంది గిరిజన కుటుంబాలకు ఇంటి నివేశస్థలాలు మంజూరు చేశారు. సోమవారం సాయంత్రం కలెక్టర్ తన చాంబర్లో గిరిజన కుటుంబాలకు ఇంటి నివేశస్థలాలకు సంబంధించిన ధృవీకరణ పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గిరిజన కుటుంబాలకు ప్రభుత్వం తరపున అన్ని విధాలా అండగా ఉంటామని తెలిపారు. నందలగుంట ప్రాంతంలో వీధిలైట్లు, ఇతర మౌలిక వసతులు కల్పించేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.

గిరిజన కుటుంబాలకు గుర్తింపు కల్పించడంతో పాటు వారికి అవసరమైన ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ అంబేద్కర్ సొసైటీ ఫర్ యూత్ అండ్ రూరల్ డెవలప్మెంట్ స్వచ్ఛంద సంస్థ వ్యవస్థాపకులు బాల చెన్నయ్య, తదితరులు పాల్గొన్నారు.

# బ్రహ్మోత్సవాల విజయానికి కృషి చేసిన అందరికి ధన్యవాదాలు

కాణిపాకం(సింధూరదర్శిని) 5 అక్టోబర్ నెల్లూరు జిల్లా ; కాణిపాకం స్వయంభు శ్రీ కాణిపాక వరసిద్ధి వినాయక స్వామి వారి దేవస్థానం కార్యనిర్వాహధికారి కార్యాలయం మీటింగ్ హాల్ నందు సోమవారం ట్రస్ట్ బోర్డ్ మీటింగ్ నిర్వహించడం జరిగింది, ఈ సమావేశం దేవస్థానం చైర్మన్ మణి నాయుడు, ఈ.వో పెంచల కిషోర్, అధ్యక్షతన నిర్వహించడం జరిగింది. చైర్మన్ మాట్లాడుతూ 2026 వార్షిక బ్రహ్మోత్సవాలు సేవలందించిన వివిధ శాఖల సిబ్బందికి, దేవస్థానం సిబ్బందికి, అర్చకులు వేద పండితులకి, మరియు ఉభయదారులు, పరిసర గ్రామస్తులం దరికీ పేరుపేరునా ధన్యవాదాలు తెలి పారు, దేవస్థానం ఈ.వో మాట్లాడుతూ బ్రహ్మోత్సవాలకు సహకారం అందించిన వివిధ శాఖల సిబ్బందికి, పోలీసు వారికి, పాలక మండలి వారికి, దేవస్థానం అధికారులు సిబ్బంది విజయవంతం చేసిన అందరికీ, కృతజ్ఞతలు తెలిపారు. ఈ సమావేశం నందు ముఖ్య అంశాలు ఆదాయ వ్యయములు, అభివృద్ధి కార్యక్ర మాలు, సామాన్య భక్తులకు సంతృప్తికర దర్శనం, వివిధ అంశాలపై పాలకమం డలి సభ్యులతో చర్చించడం జరిగింది, ఈ కార్యక్రమంలో ట్రస్ట్ బోర్డ్ సభ్యులు, చంద్రశేఖర్ రెడ్డి, నాగరాజు నాయుడు, సుధాకర్ రెడ్డి, నరేష్, శివప్రసాద్, సుబ్బారెడ్డి, సతీష్, చంద్రకళ, అనసూయ, సునీత, రాజ్యలక్ష్మి, కృష్ణవేణి, శ్రీవాణి, వసంత, సంధ్యారాణి, డిప్యూటీ ఈ.వో సాగర్ బాబు, ఏఈఓ ప్రసాద్, సిఎఫ్ఓ నాగేశ్వరరావు, సూపర్డెంట్లు, తదితరులు పాల్గొన్నారు.

ఆలయ ఈవో పెంచల కిషోర్ , ఆలయ చైర్మన్ మణి



## నెల్లూరు జిల్లాలో కరువు మండలాలుగా ప్రకటించాలి

మాజీ మంత్రి కాకాని గోవర్ధన్ రెడ్డి



నెల్లూరు( సింధూరదర్శిని) 5 అక్టోబర్ నెల్లూరు జిల్లా; మాజీ మంత్రి, ఉమ్మడి నెల్లూరు జిల్లా వైసీపీ అధ్యక్షులు,సర్వేపల్లి నియోజకవర్గ ఇంచార్జ్ కాకాణి గోవర్ధన్ రెడ్డి తో మరియు టీచర్స్ ఎమ్మెల్సీ, నెల్లూరు సిటీ నియోజకవర్గ వైసీపీ ఇంచార్జ్ పర్వత రెడ్డి చంద్రశేఖర్ రెడ్డి , నెల్లూరు రూరల్ నియోజకవర్గ వైసీపీ ఇంచార్జ్ ఆనం విజయ్ కుమార్ రెడ్డి తో కలిసి నెల్లూరు జిల్లాలో కరువు మండలాలుగా ప్రకటించాలని కోరుతూ నెల్లూరు జిల్లా కలెక్టరేట్ కార్యాలయానికి ర్యాలీగా వెళ్లి కలెక్టర్ కి వినతిపత్రం అందజేశారు. తరువాత విలేకరుల సమావేశంలో పాల్గొని మాట్లాడారు. ఈ కార్యక్రమంలో గూడూరు నియోజకవర్గ వైసీపీ ఇంచార్జ్ బూదూరు గురవయ్య పాల్గొన్నారు.

## పిల్లలకు ప్రతిరోజు వేడిగా వండిన భోజనం



గూడూరు( సింధూరదర్శిని) 5 అక్టోబర్ నెల్లూరు జిల్లా ; సీడీపీఓ ఆదేశాల మేరకు రెట్టపల్లి ఎస్సీ సెంటర్‌లోని అంగన్వాడీ కేంద్రంలో సమావేశం నిర్వహించడం జరిగింది. ఈ సమావేశంలో గర్భిణీలు, బాలింతలు మరియు తల్లులు పాల్గొన్నారు. వారికి అంగన్వాడీ కేంద్రంలో పిల్లలకు ప్రతిరోజూ మెనూ ప్రకారం వేడిగా వండిన భోజనం అందించడం జరుగుతుందని తెలియజేయడం జరిగింది. అలాగే పిల్లల అభ్యాసానికి సంబంధించిన రిమోట్ లెర్నింగ్ మెసేజ్ కార్యక్రమం గురించి తల్లులకు వివరించడం జరిగింది. పిల్లలకు కూడా ఆర్ ఎల్ ఎం మెసేజ్‌ల ద్వారా వివిధ అంశాలను తెలియజేయడం జరుగుతుందని వివరించారు. ఈ కార్యక్రమానికి రెట్టపల్లి బీజేపీ నాయకులు కిరణ్ రెడ్డి మరియు వారి సతీమణి హాజరై గర్భిణీలకు పండ్లు పంపిణీ చేశారు. అనంతరం అంగన్వాడీ కార్యకర్త, హెల్పర్ మరియు సూపర్వైజర్‌ను సన్మానించడం జరిగింది.

## చట్ట ప్రకారం విచారణ జరిపి బాధితులకు న్యాయం చేస్తాం

జిల్లా ఎస్పి డా. అజిత వెజెండ్ల



నెల్లూరు (సింధూర దర్శిని) 5 అక్టోబర్ నెల్లూరు జిల్లా ; జిల్లా పోలీసు కార్యాలయంలో జిల్లా ఎస్పి డా. అజిత వెజెండ్ల ఆధ్వర్యంలో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రజల నుంచి మొత్తం 204 ఫిర్యాదులు స్వీకరించారు. ప్రజా సమస్యలను సత్వరమే పరిష్కరించడంతో పాటు, ప్రతి ఫిర్యాదును క్షుణ్ణంగా, నిష్పక్షపాతంగా విచారించి బాధితులకు చట్టపరమైన న్యాయం అందించాలని జిల్లా ఎస్పి అధికారులను ఆదేశించారు. ప్రజా ఫిర్యాదుల పట్ల ఎలాంటి అలసత్వం ప్రదర్శించరాదని, ప్రజలతో మర్యాదపూర్వకంగా, జవాబుదారీతనంతో వ్యవహరించాలని సూచించారు. ప్రతి పిటిషన్‌ను సమగ్రంగా పరిశీలించి, త్వరితగతిన పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ప్రజా సమస్యలను త్వరితగతిన పరిష్కరించేందుకు సంబంధిత అధికారులు బాధ్యతాయుతంగా, సమన్వయంతో పనిచేయాలని సూచించారు. కార్యక్రమంలో అధికారులు, జిల్లా ఎస్.పి తో పాటు గిరిధర్ వేమారెడ్డి, సుబ్బారావు, భక్తవత్సల్ రెడ్డి సిబ్బంది పాల్గొన్నారు.

## కాణిపాకంలో 8 లక్షల 5వేలు పలికిన గణపయ్య లడ్డు

కాణిపాకం( సింధూర దర్శిని) 5 అక్టోబర్ చిత్తూరు జిల్లా ; కాణిపాకం స్వయంభు శ్రీ కాణిపాక వరసిద్ధి వినాయక స్వామి వారి దేవస్థానం 2026 వార్షిక బ్రహ్మోత్సవాలు సందర్భంగా స్వామివారి 21 రోజుల, 21 కేజీల మహా లడ్డు ప్రసాదం ఆదివారం రాత్రి తెప్పోత్సవం అనంతరం పుష్కరిణి నందు సుభద మండపంలో బహిరంగ వేలం నిర్వహించడం జరిగింది. ఈ వేలం నందు నెల్లూరుకు చెందిన శ్రీ సారంగం ప్రసాద్ , 8,05,000/- రూపాయలతో శ్రీ స్వామివారి మహాప్రసాదం లడ్డుని దక్కించుకున్నారు, వీరు నెల్లూరు నుంచి పాదయాత్రలో కాణిపాకం వచ్చి స్వామివారి లడ్డును దక్కించుకున్నారు, ఈ కార్యక్రమంలో దేవస్థానం చైర్మన్ మణి నాయుడు, మరియు ఈవో పెంచల కిషోర్ , ఆలయ అధికారులు, ట్రస్ట్ బోర్డ్ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.



# టిల్ ప్రమాద మృతుల కుటుంబానికి అండగా ముఖ్యమంత్రి చంద్రబాబు

రూ.50 లక్షల ఎక్స్‌గ్రేషియా ప్రకటన - 24 గంటల్లో నష్టపరిహారం మంజూరు

బాధిత కుటుంబాలకు చెక్కులు అందజేసిన జిల్లా కలెక్టర్

బాధిత కుటుంబాలకు ప్రభుత్వం అన్ని విధాలా అండగా ఉంటుంది: జిల్లా కలెక్టర్ డా. ఎస్.వెంకటేశ్వర్

ప్రభుత్వం ద్వారా తమ కుటుంబాలకు భరోసా కల్పించినందుకు రాష్ట్ర ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు తెలిపిన మృతుల కుటుంబ సభ్యులు

భద్రతా ప్రమాణాల పై జిల్లా వ్యాప్తంగా ప్రత్యేక తనిఖీలకు జిల్లా కలెక్టర్ ఆదేశం




శ్రీ సిటీ (సింధూరదర్శిని) 5 అక్టోబర్ తిరుపతి జిల్లా; శ్రీసిటీలోని టిల్ హెల్త్ కేర్ ప్రైవేట్ లిమిటెడ్ పరిశ్రమలో ఈ నెల 3వ తేదీన జరిగిన ప్రమాదంలో మృతి చెందిన కార్మికుల కుటుంబ సభ్యులకు రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అండగా నిలిచారని జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎస్ వెంకటేశ్వర్ పేర్కొన్నారు. సోమవారం సాయంత్రం జిల్లా కలెక్టర్ డా. ఎస్. వెంకటేశ్వర్ శ్రీసిటీ బిజినెస్ సెంటర్‌లో బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి, నష్ట పరిహారం చెక్కులను అందించారు. జిల్లా ఎస్పీ ఎల్. సుబ్బారాయుడు, శ్రీసిటీ మేనేజింగ్ డైరెక్టర్ డా. రవీంద్ర సన్నారెడ్డి, టిల్ హెల్త్ కేర్ ప్రెసిడెంట్ & మేనేజింగ్ డైరెక్టర్ కపిల్ ఝావెర్, తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ శ్రీ సిటీలోని టిల్ లో జరిగిన ప్రమాద ఘటన అత్యంత దురదృష్టకరమని, దుర్ఘటన జరిగిన వెంటనే మానవత్వంతో వెంటనే స్పందించిన రాష్ట్ర ముఖ్యమంత్రి బాధితుల కుటుంబాలకు అండగా నిలవడంతో పాటు మరణించిన కుటుంబాలకు ఒక్కొక్కరికీ రూ.50లక్షలు నష్టపరిహారం ప్రకటించారన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి ఆదేశాలతో బాధిత కుటుంబాలను నేరుగా పరామర్శించి ప్రభుత్వం అన్ని విధాలా అండగా ఉంటుందని భరోసా ఇవ్వడం జరిగిందన్నారు. ముఖ్యమంత్రి హామీ ఇచ్చిన 24 గంటల్లో ప్రతి మృతుని కుటుంబానికి కంపెనీ తరఫున రూ.50 లక్షల ఎక్స్‌గ్రేషియా చెక్కును అందించనున్నట్లు తెలిపారు. ప్రమాద బీమా పాలసీ కింద లభించే పరిహారాన్ని కూడా త్వరితగతిన అందేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు. బాధిత కుటుంబాల్లో అర్హులైన వారికి విద్య, ఉపాధి, ఉద్యోగ అవకాశాలతో పాటు అవసరమైన ఇతర సహాయ సహకారాలను అందించేందుకు ప్రభుత్వం పూర్తి బాధ్యత తీసుకుంటుందని కలెక్టర్ స్పష్టం చేశారు. కుటుంబ సభ్యుల అర్హతలు ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు జిల్లా యంత్రాంగం అవసరమైన చర్యలు చేపడుతుందని తెలిపారు. పిల్లల విద్యకు అవసరమైన సహాయాన్ని కూడా అందిస్తామని పేర్కొన్నారు. రూ.50 లక్షల ఎక్స్‌గ్రేషియాతో కలిపి తన్నీరు వాసు కుటుంబానికి రూ.78,56,278, కె.చిన్నమస్తాన్ కుటుంబానికి రూ.72,72,234, గౌరబ్‌రాయ్ కుటుంబానికి రూ.76,98,345, రమేష్ నటరాజ్ కుటుంబానికి రూ.61,50,178, మోహన్‌రాజ్ కుటుంబానికి రూ.65,25,235 మేరకు పరిహారం అందనున్నట్లు కలెక్టర్ వెల్లడించారు. ఇందుకు సంబంధించిన వివరాల పత్రాలను బాధిత కుటుంబ సభ్యులకు అందజేశారు. బాధిత కుటుంబాల సమస్యలను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ, వారికి అవసరమైన ప్రభుత్వ సహాయం అందేలా చర్యలు తీసుకుంటామని కలెక్టర్ తెలిపారు. అవసరమైన తదుపరి సహాయం లేదా సహకారం కోసం బాధిత కుటుంబ సభ్యులు ఎప్పుడైనా తనను ఫోన్ ద్వారా సంప్రదించవచ్చని హామీ ఇచ్చారు. భవిష్యత్తులో ఇలాంటి ప్రమాదాలు పునరావృతం కాకుండా కట్టుదిట్టమైన భద్రతా చర్యలు చేపడతామని తెలిపారు. ఇందులో భాగంగా శ్రీసిటీతో పాటు జిల్లాలోని అన్ని పరిశ్రమల్లో భద్రతా ప్రమాణాలపై ప్రత్యేక తనిఖీలు నిర్వహిస్తామని స్పష్టం చేశారు. జిల్లా ఎస్పీ మృతుల కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. పారిశ్రామిక ప్రాంతాల్లో కార్మికుల భద్రతా నిబంధనలు, చట్టబద్ధమైన నియమ నిబంధనలు పక్కాగా అమలయ్యేలా కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ప్రమాదవశాత్తు తమ కుటుంబ సభ్యులను కోల్పోయిన బాధితులకు భరోసా ఇస్తూ తమకు, తమ పిల్లల భవిష్యత్తుకు భరోసా కల్పించిన రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడుకి ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు. ప్రభుత్వం అందిస్తున్న నష్టపరిహారం ప్రకటించిన 24 గం.లలో చెక్కును అందించారని, ఈ నగదు తమ కుటుంబాలకు ఆర్థిక భరోసా అందించడంతో పాటు, జిల్లా కలెక్టర్ ఇచ్చిన నైతిక మద్దతు ద్వారా తమకు మనో ధైర్యం లభించిందన్నారు.

## గూడూరు లోని విద్యా మణిహారం ఎస్.కె.ఆర్.కళాశాల



గూడూరు( సింధూరదర్శిని) 5 అక్టోబర్ నెల్లూరు జిల్లా; గూడూరులోని ఎస్.కె.ఆర్. ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో స్టూడెంట్ ఇండక్షన్ ప్రోగ్రామ్ 2026 కార్యక్రమం కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె. రాం ప్రసాద్ అధ్యక్షతన విజయవంతంగా జరిగింది. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ డాక్టర్ కె.రాంప్రసాద్ మాట్లాడుతూ గూడూరు ప్రాంతంలో ఎస్.కె.ఆర్. ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఒక విద్యా మణిహారంగా నిలుస్తోందని, కళాశాల సాధించిన ప్రగతి, విద్యార్థులకు అందిస్తున్న విద్యా అవకాశాలు, వివిధ కార్యక్రమాల గురించి విద్యార్థులకు క్లుప్తంగా వివరించారు. విద్యార్థులు కళాశాలలో లభిస్తున్న అవకాశాలను సద్వినియోగం చేసుకుని ఉన్నత లక్ష్యాలను సాధించాలని సూచించారు. ఈకార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన డాక్టర్ కె.చంద్రహాస్ మాట్లాడుతూ విద్యార్థులు సమాజంలో బాధ్యతాయుతమైన పాత్ర పోషించాలని, చదువుకు ఉన్న ప్రాధాన్యతను గుర్తించి క్రమశిక్షణతో విద్యను అభ్యసించాలని సూచించారు. ప్రభుత్వం కళాశాలల్లో నిర్వహిస్తున్న వివిధ విద్యా, అభివృద్ధి కార్యక్రమాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న డాక్టర్ పి. నారాయణరాజు, డాక్టర్ ఎస్.వి.నాగేంద్రప్రసాద్ కళాశాలతో తమకున్న అనుబంధాన్ని, కళాశాల ప్రత్యేకతను, గూడూరు ఎస్.కె.ఆర్. ప్రభుత్వ డిగ్రీ కళాశాల చరిత్ర, ప్రస్థానాన్ని వివరించారు. విద్యార్థుల విద్యాభివృద్ధికి స్థానిక ఎమ్మెల్యే సునీల్‌కుమార్ అందిస్తున్న ప్రోత్సాహం తదితర అంశాలను వివరించారు. ఈ కార్యక్రమంలో నూతనంగా కళాశాలలో ప్రవేశం పొందిన ప్రథమ సంవత్సరం విద్యార్థులతో పాటు ద్వితీయ, తృతీయ సంవత్సరం విద్యార్థులు, బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు. విద్యార్థులకు కళాశాల విద్యా వాతావరణం, విద్యా అవకాశాలు, కళాశాల కార్యకలాపాలు, విద్యార్థుల బాధ్యతలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ ఎస్. కిరణ్మయి, అధ్యాపకులు డాక్టర్ గోవిందు సురేంద్ర, డాక్టర్ కె.లావణ్య, వాసంతి, డాక్టర్ యశోద, వి.వి.రమణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## టౌన్ ప్లానింగ్ అధికారి పై చర్యలు చేపట్టాలి: సీపీఐ సీనియర్ నాయకులు సి.వి.ఆర్ కుమార్




గూడూరు( సింధూరదర్శిని) 5 అక్టోబర్ నెల్లూరు జిల్లా; గూడూరు మున్సిపాలిటీలో అవినీతికి పాల్పడుతున్న టౌన్ ప్లానింగ్ అధికారి పై చర్యలు చేపట్టాలని సీపీఐ సీనియర్ నాయకులు సి.వి.ఆర్ కుమార్ తెలిపారు. సోమవారం గూడూరు పట్టణంలోని సీపీఐ కార్యాలయం నుండి రాజావీధి మీదుగా మున్సిపల్‌కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించి, మున్సిపల్ కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా సీపీఐ సీనియర్ నాయకులు సి.వి.ఆర్ కుమార్ మాట్లాడుతూ గూడూరు మున్సిపాలిటీ పరిధిలోని ఎన్ఎస్ఆర్ ప్రసన్న రెడ్డి లేఔట్‌లో ఓపెన్ స్పేస్ -1 గా చూపించిన భూమి రిజిస్టర్ చేసిన గిఫ్ట్ డీడ్ లో పేర్కొన్న భూమీమధ్య వ్యత్యాసాలపై విచారణ జరపాలన్నారు. ప్రభుత్వానికి సుమారు 78లక్షల రూపాయలు నష్టం వాటిందన్నారు. ఎన్ఎస్ఆర్ ప్రసన్న రెడ్డి లేఔట్ ప్లాన్‌లో భాగం కానీ సర్వే నంబర్ 521 /A 1 B 10 సెంట్లు భూమిని ఓపెన్ స్పేస్ -1 లో చూపించి గూడూరు మున్సిపాలిటీకి రిజిస్టర్ చేసిన గిఫ్ట్ డిడ్ డాక్యుమెంట్ నెంబర్ 2687/2021 లో సర్వే నంబర్ 519/2, 519/3, 520/A1A2, 520/A1B2, 521/A1A, 521/A2లో ఓపెన్‌ఫేస్-1గా ఉన్నట్లుగా రిజిస్టర్ చేశారు. తద్వారా ప్రభుత్వ ఖజానాకు మార్కెట్ వ్యాల్యూ ప్రకారం 78 లక్షలు రూపాయలు పైగా నష్టం చేకూరింది. ప్రభుత్వాన్ని మోసం చేయాలని ముందుగా నిర్ణయించుకుని గూడూరు మున్సిపాలిటీ టౌన్ ప్లానింగ్ అధికారి ప్రకాష్ బాబు, ఎన్ ఎస్ ఆర్ ప్రసన్నారెడ్డి లేఔట్ యజమానులు నువ్వురు పద్మ ప్రసన్నారెడ్డి కలిసి మోసం చేశారు అన్నారు. వీరి పై సమగ్ర విచారణ చేసి క్రిమినల్ కేసులు నమోదు చేసి, అరెస్ట్ చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం గూడూరు పురపాలక కమిషనర్ మల్లికార్జునరావుకి వినతిపత్రం అందచేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి జి.శశికుమార్, సీపీఐ పట్టణ కన్వీనర్ సునీల్, సీపీఐ చిల్లకూరు మండల కార్యదర్శి రమేష్, ఏ.ఐ.టి. యు.సి జిల్లా అధ్యక్షులు కె.నారాయణ, బి.కె.ఎం.యు నియోజకవర్గ కార్యదర్శి శ్రీనివాసమూర్తి, తదితరులు పాల్గొన్నారు.

# ఉద్యోగులు పింఛనుదారులకు మెరుగైన సేవలు

## కోవూరులో నూతన ఉప ఖజానా కార్యాలయం ప్రారంభం

### రూ.కోటితో నిర్మించిన నూతన భవనాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి



కోవూరు (సింధూరదర్శిని)5 అక్టోబర్ నెల్లూరు జిల్లా; కోవూరు నియోజకవర్గంలోని ప్రభుత్వ ఉద్యోగులు, పింఛనుదారులు, వివిధ ప్రభుత్వ శాఖలకు మెరుగైన సేవలు అందించేందుకు నూతన ఉప ఖజానా కార్యాలయాన్ని ఏర్పాటు చేయడం సంతోషంగా ఉందని కోవూరు శాసన సభ్యులు వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి తెలిపారు. సోమవారం కోవూరు మండల కేంద్రంలో రూ.కోటి వ్యయంతో నిర్మించిన నూతన ఉప ఖజానా కార్యాలయ భవనాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. అనంతరం కోవూరు తాలూకా నాన్-గెజిటెడ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం (ఎన్జీజీవోస్) కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో పాల్గొని ఉద్యోగులతో మాట్లాడారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి మాట్లాడుతూ గతంలో ఇదే ప్రాంగణంలో ఉన్న ఉప ఖజానా కార్యాలయం శిథిలావస్థకు చేరడంతో అక్కడ పనిచేసే సిబ్బందికి కనీస సౌకర్యాలు కూడా లేకుండా పోయాయని తెలిపారు. ప్రతిరోజూ ఎంతోమంది ఉద్యోగులు, పింఛనుదారులు, వివిధ ప్రభుత్వ కార్యాలయాలకు సంబంధించిన ఆర్థిక లావాదేవీలు నిర్వహించే కార్యాలయానికి తగిన వసతులు ఉండాల్సిన అవసరం ఉందన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ఈ సమస్యను ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు దృష్టికి తీసుకెళ్లగా, నూతన భవనా నికి ప్రభుత్వం అనుమతి మంజూరు చేసిందని తెలిపారు. రూ.కోటితో నిర్మించిన ఈ నూతన కార్యాలయ భవనం ద్వారా కోవూరు, కొడవలూరు, విడవలూరు, అల్లూరు మండలాలకు చెందిన ప్రభుత్వ ఉద్యోగులు, పింఛనుదారులు, ప్రభుత్వ కార్యాలయాలకు మెరుగైన సేవలు అందుబాటులోకి వస్తాయని చెప్పారు. ఈ ఉపఖజానా కార్యాలయం పరిధిలో సుమారు 150మంది డీడీఓలు ఉన్నారని ఎమ్మెల్యే తెలిపారు. ప్రభుత్వ ఉద్యోగుల వేతన బిల్లులు, ప్రయాణ భత్యాలు, వైద్య ఖర్చుల చెల్లింపులు, సెలవులకు సంబంధించిన ఆర్థిక ప్రయోజనాలు, ఇతర ప్రభుత్వ బిల్లుల చెల్లింపుల్లో ఉప ఖజానా కార్యాలయం కీలక పాత్ర పోషిస్తుందని చెప్పారు. ఇలాంటి ముఖ్యమైన సేవలు అందించే ఉద్యోగులకు మెరుగైన కార్యాలయ వసతులు కల్పించడం పట్ల సంతోషం వ్యక్తం చేశారు. నూతన కార్యాలయంలో విధులు నిర్వహిస్తున్న ఉద్యోగులందరికీ ఎమ్మెల్యే అభినందనలు తెలిపారు. ప్రజలకు ప్రభుత్వ సేవలు వేగంగా, పారదర్శకంగా అందేలా ప్రతి ఒక్కరూ బాధ్యతతో పనిచేయాలని కోరారు.

**ప్రజలకు-ప్రభుత్వానికి ఉద్యోగులే వారధులు**

ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు, కార్యక్రమాలు, సంక్షేమ ఫలాలు ప్రజలకు చేరడంలో ప్రభుత్వ ఉద్యోగుల పాత్ర ఎంతో కీలకమని ఎమ్మెల్యే అన్నారు. నాయకులకు, ప్రజలకు మధ్య ఉద్యోగులు వారధులుగా ఉంటారని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రజలకు సేవ చేయాలనే లక్ష్యంతో నిరంతరం పనిచేస్తున్నారని, అదే స్ఫూర్తితో అధికారులు, ఉద్యోగులు కూడా తమ విధులను చిత్తశుద్ధితో నిర్వహించాలని కోరారు. ప్రజలు కార్యాలయాలకు వచ్చినప్పుడు వారికి సరైన సమాధానం ఇవ్వాలని సూచించారు. ప్రజలకు ప్రభుత్వం అందించాలనుకున్న సేవలు, సంక్షేమ కార్యక్రమాలు సక్రమంగా వారికి చేరాలంటే క్షేత్రస్థాయిలో ఉద్యోగుల పనితీరు ఎంతో ముఖ్యమని ఎమ్మెల్యే తెలిపారు. కోవూరు నియోజకవర్గంలో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ప్రభుత్వ సేవలు అందేలా ప్రతి ఒక్కరూ బాధ్యత తీసుకోవాలని కోరారు.

**ఉద్యోగుల పక్షాన కూటమి ప్రభుత్వం**

కోవూరు తాలూకా నాన్-గెజిటెడ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం (ఎన్జీజీవోస్) ప్రతినిధులు ఇటీవల తమ సమస్యలపై ఇచ్చిన వినతికి ప్రభుత్వం స్పందించిన విషయాన్ని ఎమ్మెల్యే గుర్తు చేశారు. ఉద్యోగుల సమస్యల పట్ల కూటమి ప్రభుత్వం సానుకూలంగా ఉందనడానికి, ఇప్పటికే రెండు విడతల కరువు భత్యాన్ని (డీఏ) విడుదల చేయడమే నిదర్శనమని పేర్కొన్నారు. ఉద్యోగుల సమస్యలు, వారి సంక్షేమం పట్ల కూటమి ప్రభుత్వం ఎల్లప్పుడూ అండగా ఉంటుందని చెప్పారు. ప్రభుత్వం నుంచి కొత్త పథకాలు, కార్యక్రమాలు వచ్చినప్పుడు గ్రామ, వార్డు సచివాలయాల ద్వారా ప్రజలకు అగాహన కల్పించడంలో ఉద్యోగులు కీలక పాత్ర పోషించాలని ఎమ్మెల్యే కోరారు.

# అర్జీదారుల సమస్యలను వేగవంతంగా పరిష్కరించండి

### వృద్ధులు, దివ్యాంగుల సమస్యలపై ప్రత్యేక దృష్టిని కేంద్రీకరించండి

### జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా



నెల్లూరు (సింధూర దర్శిని) 5 అక్టోబర్ నెల్లూరు జిల్లా ; జిల్లాలోని సుదూర ప్రాంతాల నుంచి తమ సమస్యలు పరిష్కారమవుతాయనే ఆశతో వచ్చే అర్జీదారుల పట్ల అధికారులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలి. ప్రతి అర్జీని క్షేత్రస్థాయిలో సమగ్రంగా పరిశీలించి అర్జీదారుడు సంతృప్తి చెందే విధంగా నిర్ణీత గడువులోపు పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా అన్ని శాఖల అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని తిక్కన ప్రాంగణంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లాతో పాటు జేసి మొగిలి వెంకటేశ్వర్లు, డిఆర్వో విజయకుమార్, మెప్మా పీడి కిరణ్ కుమార్, సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ డిప్యూటీ డైరెక్టర్ నాగశేఖర్, ఐటిడిఎ పివో శ్రీనివాస్, డిప్యూటీ కలెక్టర్ వంశీకృష్ణ, తదితరులు ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా మాట్లాడుతూ, ఫిర్యాదుదారుల విజ్ఞప్తులను సంబంధిత అధికారులు క్షేత్రస్థాయిలో క్షుణ్ణంగా పరిశీలించి, పారదర్శకంగా విచారణ నిర్వహించి అర్జీదారుడు సంతృప్తి చెందేలా నిర్ణీత గడువులోపు తప్పనిసరిగా పరిష్కరించాలని ఆదేశించారు. పెండింగ్ బియాండ్ ఎస్ఎల్ఏ, రీ-ఓపెనింగ్‌కు ఆస్కారం లేకుండా నాణ్యతతో సమస్యలను పరిష్కరించాలని సూచించారు. వృద్ధులు, దివ్యాంగుల సమస్యలపై ప్రత్యేక దృష్టిని కేంద్రీకరించి మానవతాదృక్పథంతో పరిష్కారానికి సత్వర చర్యలు తీసుకోవాలని సూచించారు. జిల్లాలో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థను మరింత పారదర్శకంగా, సమర్థవంతంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ అధికారులను ఆదేశించారు. ప్రభుత్వం ప్రవేశపెట్టిన సిటిజన్ ఫీడ్‌బ్యాక్ క్యూఆర్ కోడ్ ను అన్ని ప్రభుత్వ కార్యాలయాలు, ప్రజా ఫిర్యాదుల పరిష్కార కేంద్రాలు, పౌర సేవా కేంద్రాల్లో తప్పనిసరిగా ప్రదర్శించాలని సూచించారు. ఫిర్యాదుదారులు క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేసి తమ సమస్యల పరిష్కారంపై ఫీడ్‌బ్యాక్ అందించేలా అవగాహన కల్పించాలని అధికారులకు సూచించారు. ప్రజల నుంచి అందే ఫీడ్‌బ్యాక్‌ను ఎప్పటికప్పుడు పరిశీలించి సేవల నాణ్యతను మరింత మెరుగుపరిచే చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ప్రజలకు పారదర్శకమైన, జవాబుదారీతనంతో కూడిన సేవలు అందించడమే ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని కలెక్టర్ తెలిపారు. పీజీఆర్ఎస్‌కు వచ్చే అర్జీదారులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా జిల్లా యంత్రాంగం ప్రత్యేక ఏర్పాట్లు చేసింది. ప్రత్యేక క్యూ లైన్లు, తాగునీటి సదుపాయం, ఉచిత భోజన ఏర్పాట్లు కల్పించింది. రెవెన్యూ సంబంధిత సమస్యల పరిష్కారానికి ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేయడంతో పాటు, అర్జీదారులకు అవసరమైన ప్రాథమిక వైద్య సేవలు అందుబాటులో ఉండేలా ప్రత్యేక చర్యలు చేపట్టింది. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# సమృద్ధిగా వర్షాలు కురిసి రాష్ట్రం సుభిక్షంగా ఉండాలి

### రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు వరుణ యాగం - ఆలయ ఈవో గిరి కృష్ణ, ఆలయ చైర్మన్ కోటా సతీష్ యాదవ్

గూడూరు (సింధూరదర్శిని)5 అక్టోబర్ నెల్లూరు జిల్లా; సకాలంలో సమృద్ధిగా వర్షాలు కురిసి రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి సూచనలతో ఎమ్మెల్యే పాశం సునీల్ కుమార్ పర్యవేక్షణలో చిల్లకూరు మండల పరిధిలోని తమ్మిన పట్టణం శ్రీ కోదండ రామస్వామి దేవస్థానం నందు మంగళవారం వరుణ యాగం మరియు సహస్ర ఘటాభిషేక మహోత్సవం నిర్వహించనున్నారని ఆలయ ఈవో గిరి కృష్ణ ,ఆలయ చైర్మన్ కోటా సతీష్ యాదవ్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమంలో భాగంగా ఉదయం 6:45 గంటలకు రుత్విక్కులచే శాస్త్రోక్తంగా ప్రత్యేక పూజా కార్యక్రమాలు, సహస్ర ఘటాభిషేకం మరియు వరుణ దేవునికి ప్రత్యేక యాగ కార్యక్రమాలు నిర్వహించబడుతున్నాయి. ఈ యాగ కార్యక్రమం ద్వారా సకాలంలో వర్షాలు కురిసి, పంటలు సమృద్ధిగా పడాలని, రైతులు సుఖసంతోషాలతో ఉండాలని, ప్రజలందరికీ ఆయురారోగ్య ఐశ్వర్యాలు కలగాలని స్వామివారిని ప్రార్థించనున్నారు. కావున భక్తులు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని వరుణ యాగ కార్యక్రమంలో పాల్గొని స్వామివారి కృపకు పాత్రులు కావలసిందిగా కోరుతున్నారు.

# స్వచ్ఛమైన నెల్లూరు సాధనకు మరింత అంకితభావంతో పనిచేయాలి

### జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల - జిల్లాలో 79మందికి స్వచ్ఛాంధ్ర అవార్డుల ప్రదానం




నెల్లూరు( సింధూర దర్శిని) 5 అక్టోబర్ నెల్లూరు జిల్లా ; స్వచ్ఛాంధ్ర అవార్డులు ప్రతి ఒక్కరిలో నూతన ఉత్సాహాన్ని, సరికొత్త స్ఫూర్తిని నింపుతాయని, ఇదే స్ఫూర్తితో స్వచ్ఛమైన నెల్లూరు సాధనకు ప్రతి ఒక్కరూ మరింత అంకితభావంతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల పిలుపునిచ్చారు. మహాత్మా గాంధీ జయంతిని పురస్కరించుకుని రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా ప్రధానం చేసిన స్వచ్ఛాంధ్ర అవార్డులలో భాగంగా జిల్లాలో ఎంపికైన 79 మంది అవార్డు గ్రహీతలకు సోమవారం కలెక్టరేట్‌లోని తిక్కన ప్రాంగణంలో జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల చేతుల మీదుగా అవార్డులను ప్రదానం చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అవార్డులు అందుకున్న వారిలో నూతన ఉత్సాహాన్ని, సరికొత్త స్ఫూర్తిని నింపుతాయని అన్నారు. ఇదే ఉత్సాహంతో ఉద్యోగులు ప్రజలకు మరింత మెరుగైన పౌర సేవలు అందించాలని సూచించారు. మున్సిపాలిటీలు, గ్రామ పంచాయతీలు, పాఠశాలలు, కళాశాలలు, హాస్టళ్లలో ప్రజలకు, విద్యార్థులకు నాణ్యమైన సేవలు అందించేలా సమన్వయంతో పనిచేయాలని పేర్కొన్నారు. జిల్లాలో స్వచ్ఛ మున్సిపాలిటీలు, స్వచ్ఛతా వారియర్స్, స్వచ్ఛ కాలనీలు, స్వచ్ఛ పార్కులు, స్వచ్ఛ పాఠశాలలు, స్వచ్ఛ హాస్టళ్లు, స్వచ్ఛ పరిశ్రమలు, స్వచ్ఛ రైతుబజార్లు, స్వచ్ఛ బస్టాండ్లు, స్వచ్ఛ గ్రామ పంచాయతీలు తదితర విభాగాల్లో మొత్తం 26 కేటగిరీలలో విశిష్ట సేవలు అందించిన ఉద్యోగులు, వివిధ రంగాల ప్రముఖులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులను అవార్డులకు ఎంపిక చేశారు. ఎంపికైన 79 మందికి జిల్లా కలెక్టర్ జ్ఞాపికలు, ప్రశంసాపత్రాలను అందజేశారు. స్వచ్ఛతను నిరంతరం కొనసాగిస్తూ జిల్లాను పరిశుభ్రమైన, ఆరోగ్యకరమైన జిల్లాగా తీర్చిదిద్దేందుకు ప్రతి ఒక్కరూ తమ వంతు బాధ్యతగా కృషి చేయాలని కలెక్టర్ కోరారు.

ఈ కార్యక్రమంలో డి ఆర్ వో విజయ్ కుమార్, నగర కమిషనర్ నందన్, జిల్లా పంచాయతీ అధికారి వెంకట్రామన్, ఆర్డబ్ల్యూఎస్ ఎస్ఈ విజయ్ భాస్కర్, డిఆర్డిఎ పిడి నాగరాజకుమారి, మెప్మా పిడి కిరణ్‌కుమార్, ఐటిడిఎ పీవో శ్రీనివాసరావు, డిఇఓ ఆర్. బాలాజీరావు, పరిశ్రమల శాఖ జిఎం శ్రీధర్‌బాబు, తదితరులు పాల్గొన్నారు.

# హత్య కేసులో ఇద్దరు ముద్దాయిలకు జీవిత ఖైదు: రూ.5వేల జరిమానా



గూడూరు (సింధూరదర్శిని) 5 అక్టోబర్ నెల్లూరు జిల్లా ; సూళ్లూరుపేట సర్కిల్ పరిధిలోని మన్నారు పోలూరు క్రాస్ రోడ్డు వద్ద 2023 సంవత్సరంలో జరిగిన జగదీష్ హత్య కేసులో ఇద్దరు ముద్దాయిలకు గూడూరు 7 వ అదనపు జిల్లా జడ్జ్ జీవిత ఖైదు 5వేల రూపాయలు జరిమానా విధించారని ఏపీపీ వసంత్ కుమార్ వెల్లడించారు. గూడూరు పట్టణంలోని కోర్టు హాల్లో ఏ పి పి వసంత్ కుమార్ మీడియాతో మాట్లాడుతూ 2023 సంవత్సరంలో సూళ్లూరుపేట సర్కిల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని మన్నారు పోలూరు క్రాస్ రోడ్డు వద్ద అక్రమ సంబంధానికి అడ్డుగా ఉన్నాడని నెల్లూరు చిత్ర అనే మహిళా తన ప్రియుడు కృష్ణమూర్తి తో కలిసి భర్త జగదీష్ ను హత్య చేశారని తెలిపారు. కేసు విచారణ పూర్తయి ఏడవ అదనపు జిల్లా జడ్జి నాయుడు ఏ1 ముద్దాయి కృష్ణమూర్తి ఏటు ముద్దాయి చిత్ర కు జీవిత ఖైదు ఒక్కొక్కరికి ఐదు వేల రూపాయలు జరిమానా విధించారని జరిమానా కట్టని పక్షంలో ఆరు నెలలు అదనపు శిక్ష విధించారని పేర్కొన్నారు. ఈ కేసులో నాయుడుపేట డిఎస్పి చెంచు బాబు సిఐలు ఎస్ఐలు సకాలంలో సాక్షులను కోర్టులో ప్రవేశపెట్టారని ఈ తీర్పుతో ప్రజల్లో న్యాయ వ్యవస్థ పై నమ్మకం పెరిగిందని వెల్లడించారు . ఈ సమావేశంలో లైజనింగ్ ఆఫీసర్ దానం మల్లికార్జున్ పాల్గొన్నారు.

# యూరిక్ ఆసిడ్‌ను సహజంగా తగ్గించుకోవటం ఎలా?

ప్రతి రోజు 2 నుండి 3 లీటర్ల నీటిని తాగండి

యూరిక్ ఆసిడ్ స్ఫటికాలను కరిగించే తినే సోడా ద్రావణాన్ని తాగండి

యూరిక్ ఆసిడ్ ఏర్పడుటకు కారణమైన

ప్యూరిన్ కలిగిన ఆహారాలను తక్కువగా తినండి



మన శరీరం సహజంగా యూరిక్ ఆసిడ్ ను ఉత్పత్తి చేస్తుంది. ప్యూరిన్‌లు విచ్ఛిన్నం అవటం వలన ఈ వ్యర్థ పదార్థం ఏర్పడుతుంది. సాధారణంగా, యూరిక్ ఆసిడ్ రక్తం ద్వారా మూత్ర పిండాలలోకి ప్రవేశించి, మూత్రం ద్వారా బయటకు పంపబడుతుంది. కానీ, మూత్రపిండాల ద్వారా అధిక మొత్తంలో యూరిక్ ఆసిడ్ బయటకు పంపబడితే, గౌట్ అటాక్ కు గురయ్యే అవకాశం ఉంది. కావున మన శరీరంలో యూరిక్ ఆసిడ్ స్థాయిలను నియంత్రణలో ఉంచుకోవటం చాలా మంచిది.

### తినే ఆహారంలో సర్దుబాటు

ప్యూరిన్ అనేది సహజ పదార్థం మరియు శరీరానికి శక్తిని కూడా అందిస్తుంది. మనం తినే ఆహార పదార్థాలలో దాదాపు ప్యూరిన్ అధి కంగా ఉంటుంది, ఫలితంగా యూరిక్ ఆసిడ్ అదనంగా తయారై, మూత్రపిండాల సంబంధిత సమస్యలకు కారణం అవుతుంది.
రెడ్ మీట్, సముద్రపు ఆహరం, ఆర్గాన్ మీట్ మరియు కొన్ని రాకల బీన్స్ అధిక మొత్తంలో ప్యూరిన్ లను కలిగి ఉంటాయి. శుద్ధి చేయబడిన కార్బోహైడ్రేట్లు మరియు ఆస్పారగస్, పుట్టగొడుగులు, కాలీఫ్లవర్ వంటి కూరగాయలు అధిక మొత్తంలో ప్యూరిన్ లను అధికంగా కలిగి ఉంటాయి కావున వీటికి దూరంగా ఉండండి.

### ఫ్రక్టోస్‌కు దూరంగా ఉండండి

శరీరంలో సహజంగా యూరిక్ ఆసిడ్ స్థాయిలు తగ్గాలంటే సోడా సేకరణను తగ్గించండి. ఆర్థ్రైటిస్ టూడే వెబ్సైట్ లో ప్రచురించిన దాని ప్రకారం, వారంలో 6 సార్లు కూల్ డ్రింక్, సోడా వంటి తాగే వారిలో గౌట్ కలిగే అవకాశం అధికంగా ఉంటుందని ఇటీవల జరిపిన పరిశోధనలలో తెలుపబడింది. ఈ పరిశోధనలలో కూల్ డ్రింక్స్, సోడాల ప్రభావాల గురించి తెలిపారు కానీ, పండ్లరసాలు, చక్కెర ద్రావణాల గురించి ఎలాంటి ప్రస్తావన రాలేదు.

### శరీర బరువుని నిర్వహించటం

మీరు అదనపు బరువు కలిగి ఉంటే, అధిక ప్యూరిన్ గల ఆహార పదార్థాల సేకరణ వలన శరీరంలో యూరిక్ ఆసిడ్ స్థాయిలు పెరిగే అవకాశం ఉంది. వేగంగా బరువు తగ్గటం కూడా దీనికి ఒక కారణం కావచ్చు. కావున, క్రాష్ డైటింగ్ కు వీలైనంత దూరంగా ఉండటం మంచిది. ఒకవేళ మీరు ఊబకాయులు అయితే, శరీరంలో యూరిక్ ఆసిడ్ స్థాయిలు పెరగకుండా ఉండాంటే, శరీర బరువును తగ్గించుకోటానికి ప్రయత్నించండి.

### పరిమితంగా ఆల్కహాల్ సేకరణ

ఆల్కహాల్ శరీరాన్ని డీ హైడ్రేషన్ కు గురి చేస్తుంది, కావున మితిమీరిన స్థాయిలో ఆల్కహాల్ ను తీసు కోకండి. బీర్‌కు ఎందుకు దూరంగా ఉండాలంటే వీటిలో ఉండే ఈస్ట్ అధికంగా ఉంటుంది కావున. కానీ, వైన్ ఏ విధంగానూ శరీరంలోని యూరిక్ ఆసిడ్ స్థాయిలను ప్రభావిత పరచదు. బీర్ ఎక్కువగా తాగే అలవాటు ఉంటే తగ్గించుకోవటం మీకే చాలా మంచిది.

### అధికంగా నీటిని తీసుకోండి

మీ శరీరాన్ని ఎల్లపుడు హైడ్రేటేడ్‌గా ఉంచుకోండి. అంతేకాకుండా, శరీరంలో ఉండే యూరిక్ ఆసిడ్ ను శరీరం నుండి భయటకు పంపుటకు శరీరం హైడ్రేటేడ్ గా ఉండాలి. యూరిక్ ఆసిడ్‌లను నీరు రక్తంలో విలీనం చేసి, కిడ్నీల ద్వారా ఈవ్యర్థ పదార్థాలను బయటకు పంపేలా చేస్తుంది.



### బేకింగ్ సోడా ద్రావణాన్ని తీసుకోండి

సగం చెంచా బేకింగ్ సోడాను నీటిలో కలపండి. బాగా కలిపి, రోజు 8గ్లాసుల వరకు తాగండి. బేకింగ్ సోడా లేదా తినే సోడా ద్రావణం యూరిక్ ఆసిడ్ స్ఫటికాలని కరిగించి, యూరిక్ ఆసిడ్ కు కరిగే గుణాన్ని ఆపాదిస్తుంది.



బేకింగ్ సోడాను తీసు కునే సమయంలో జాగ్రత్తలు వచిం చాలి, ఎందుకంటే వీటిలో సోడియం అధిక మొత్తంలో ఉంటుంది. ఫలితంగా శరీర రక్త పీడనం ప్రభావానికి గురయ్యే అవకాశం ఉంది. శరీరంలో యూరిక్ ఆసిడ్ స్థాయిలను తగ్గించుటకు ఈ సహజ ఔషదాలు చాలా సురక్షితం అని చెప్పవచ్చు. దీనిని స్వతహాగా తీసుకునే ముందు వైద్యుడిని కలిసి తగిన జాగ్రత్తలు పాటించటం చాలా మంచిది.

### రావి చెట్టు: ది ట్రీ ఆఫ్ లైఫ్

హిందువులు మరియు బౌద్ధులు పవిత్ర వ ృక్షంగా భావించే రావి చెట్టు గురించి మనందరికీ తెలిసిందే. ఈ వ ృక్షం మలబద్ధకం, మధు మేహం మరియు చెవి సంబంధిత సమస్యల నుండి ఉపశమనం కలిగిస్తుంది. వాటి గురించి ఇక్కడ తెలుపబడింది.

### మలబద్ధకం నుండి ఉపశమనం

ఆకులను ఎండబెట్టి వాటిని గ్రైండ్ చేయండి. ఈ పొడికి సోంపు విత్తనాలను, పచ్చి బ్రౌన్ పౌడర్ మరియు బెల్లంను సమాన మొత్తా లలో కలపండి. ఈ మిశ్రమాన్ని ఒక గ్లాసు నీటికి కలపండి. ఈ మిశ్రమాన్ని తాగటం వలన మలబద్ధకం నుండి ఉపశమనం పొందుతారు.



### మధుమేహ నిర్వహణలో సహాయం

భారతదేశం సహా అనేక దేశాలలో వేగంగా పెరుగుతున్న ముప్పుగా డయాబెటిస్‌ను పేర్కొనవచ్చు. పురాతన కాలంలో మధుమేహ వ్యాధిని తగ్గించటానికి రావి చెట్టు సారాన్ని వాడే వారని అధ్యయ నాలలో తెలిపారు. రావి చెట్టు నుండి సేకరించిన సారం రక్తంలోని చక్కెర స్థాయిలను తగ్గిస్తుంది.

### చెవి ఇన్ఫెక్షన్‌లకు చికిత్సగా

రావి చెట్టు ఆకులతో చెవి ఇనాెక్షన్ లను తగ్గించవచ్చుబీ చెట్టు ఆకు కింద మంటను ఉంచి, దాని నుండి వచ్చే రసాన్ని సేకరించండి. ఇలా వచ్చిన రసం చల్లారిన తరువాత, రెండు లేదా మూడు చుక్కలను చెవిలో వేసుకోండి. ఇలా చేయటం వలన చెవిలో ఉండే వివిధ ఇనాెక్షన్ లు తగ్గిపోతాయి.

**యాంటీమైక్రోబియాల్ గుణాలు**

యాంటీ మైక్రోబియాల్ గుణాల గురించి తెలుసుకోటా నికి రావి చెట్టు ఆకుల సారాన్ని తీసుకొని పరీక్ష చేసారు. వీరు పరిశోధనలు జరిపి, బాసిల్లస్ సబ్టైలిస్, ఎస్చేరిచియాకోలి, స్టెపైలో కోకస్, కాండిడా అల్బి కానా, ఫంగస్ న్కెజర్, సూడోమొనాస్ ఎరుగినోస వంటి బ్యాక్టీరియా మరియు ఫంగస్ లను నియంత్రిస్తుందని కనుగొన్నారు.

# 9న సిఎం చంద్రబాబు జిల్లాకు రాక

నర్సింగోలులో 8,500 మంది రైతులకు పట్టాదారు పాస్‌పుస్తకాల పంపిణీకి శ్రీకారం

'మీ భూమి – మీ హక్కు' కార్యక్రమంలో రాజముద్రతో పాస్‌పుస్తకాలు అందజేత

కలికివాయి, బిట్రగుంట, నర్సింగోలు ప్రాంతాలను పరిశీలించిన మంత్రులు ఆనం, స్వామి, కలెక్టర్, ఎస్పీ, జేసి, ఎమ్మెల్యేలు

సిఎం పర్యటనను సమన్వయంతో విజయవంతం చేస్తామని వెల్లడి

నర్సింగోలులో రామలింగేశ్వర ఆలయంలో నేతలు ప్రత్యేక పూజలు





జరుగుమల్లి సింధూరదర్శిని: రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఈ నెల 9వ తేదీన కొండేపి నియోజకవర్గంలో పర్యటించనున్న నేపథ్యంలో పర్యటన ఏర్పాట్లను రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి, ఒంగోలు జిల్లా ఇన్‌చార్జి మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి, రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డోలా బాల వీరాంజనేయ స్వామి, జిల్లా కలెక్టర్ పి.రాజాబాబుతో కలిసి సోమవారం పరిశీలించారు. కలికివాయి, బిట్రగుంట, నర్సింగోలు ప్రాంతాల్లో ముఖ్యమంత్రి పర్యటనకు అనువైన స్థలాలను మంత్రులు, జిల్లా అధికారులతో కలిసి పరిశీలించారు. అనంతరం నర్సింగోలులోని రామలింగేశ్వర స్వామి, పార్వతీదేవి ఆలయంతో పాటు శనీశ్వర ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి ఆనం రామనారాయణరెడ్డి మాట్లాడుతూ రైతుల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందన్నారు. ముఖ్యమంత్రి శ్రీ నారా చంద్రబాబు నాయుడు ప్రతి నెల 9వ తేదీన రైతుల సంక్షేమానికి సంబంధించిన కార్యక్రమాలను నిర్వహిస్తున్నారని తెలిపారు. ఈనెల 9వ తేదీన కొండేపి నియోజక వర్గంలోని నర్సింగోలులో సుమారు 8,500 మంది రైతు లకు పట్టాదారు పాస్‌పుస్తకాలను పంపిణీ చేయనున్నట్లు వెల్లడించారు. 'మీ భూమి – మీ హక్కు' కార్యక్రమంలో భాగంగా రాజముద్రతో ముద్రించిన పట్టాదారు పాస్‌పుస్తకాలను రైతులకు అందజేస్తామని తెలిపారు. ముఖ్యమంత్రి పర్యటనకు సంబంధించి కలికివాయి, బిట్రగుంట, నర్సింగోలు ప్రాంతాల్లో మూడు స్థలాలను పరిశీలించినట్లు మంత్రి తెలిపారు. నర్సింగోలు స్థలానికి సంబంధించి జిల్లా కలెక్టర్ ద్వారా ముఖ్యమంత్రి కార్యాలయానికి నివేదిక పంపించనున్నట్లు వెల్లడించారు. మరో రెండు, మూడు రోజుల్లో ముఖ్యమంత్రి పర్యటనకు సంబంధించిన పూర్తి కార్యక్రమం ఖరారయ్యే అవకాశం ఉందన్నారు. ముఖ్యమంత్రి పర్యటనను విజయవంతం చేసేందుకు ప్రజలు, రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి విజ్ఞప్తి చేశారు. రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డోలా బాల వీరాంజనేయ స్వామి మాట్లాడుతూ ఈ నెల 9వ తేదీన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కొండేపి నియోజకవర్గంలోని నర్సింగోలులో పర్యటించి 8,000 మందికి పైగా రైతులకు పట్టాదారు పాస్‌పుస్తకాలను అందజేయనున్నట్లు తెలిపారు. 'మీ భూమి -- మీ హక్కు' కార్యక్రమం ద్వారా రైతులకు భూమిపై సంపూర్ణ హక్కు కల్పించే దిశగా ప్రభుత్వం చర్యలు చేపడుతోందన్నారు. రాజముద్రతో ముద్రించిన పట్టాదారు పాస్‌పుస్తకాలను రైతులకు అంద జేయడం ద్వారా భూ హక్కులకు మరింత భద్రత కల్పిస్తున్నామని తెలిపారు. జిల్లాలో ఇప్పటికే సుమారు 4,000 ఎకరాల నిషేధిత భూములకు సంబంధించిన గ్రామ కంతాల క్లియరెన్స్ ఇచ్చినట్లు మంత్రి తెలిపారు. నర్సింగోలు గ్రామంలో సుమారు 400 ఎకరాలకు క్లియరెన్స్ ఇచ్చినట్లు వెల్లడించారు. ఇప్పటివరకు వేల ఎకరాలకు సంబంధించిన రైతులకు పట్టాదారు పాస్‌పుస్తకాలను అందజేసినట్లు తెలిపారు.

## పవన్ కల్యాణ్ ఆదేశాలతో ఇంద్రకీలాద్రిపై ప్రధాని మోదీ పేరిట పూజలు

మోదీ 25 ఏళ్ల ప్రజా ప్రస్థానం పూర్తి చేసుకున్న సందర్భంగా ఈ కార్యక్రమం

పవన్ కల్యాణ్ ఆదేశాలతో ఎంపీ లింగమనేని రమేశ్ పూజల నిర్వహణ

అమ్మవారికి విశిష్టమైన ఖడ్గమాల అర్చన జరపనున్న ఎంపీ

ప్రధానికి ఆయురారోగ్యాలు, దీర్ఘాయుష్షు కలగాలని ఆకాంక్ష



విజయవాడ సింధూరదర్శిని: ప్రధానమంత్రి నరేంద్ర మోదీ 25 ఏళ్ల ప్రజా ప్రస్థానాన్ని పూర్తి చేసుకుంటున్న చారిత్రక సందర్భాన్ని పురస్కరించుకుని విజయవాడ ఇంద్రకీలాద్రిపై ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు. అక్టోబర్ 7వ తేదీన శ్రీ కనకదుర్గమ్మ అమ్మవారి ఆలయంలో ప్రధాని మోదీ పేరిట ఈ పూజా కార్యక్రమాలను చేపట్టనున్నారు. ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి, జనసేన అధినేత పవన్ కల్యాణ్ ఆదేశాల మేరకు రాజ్యసభ సభ్యులు లింగమనేని రమేశ్ ఈ పూజలను నిర్వహిస్తున్నారు. 2001లో గుజరాత్ ముఖ్యమంత్రిగా ప్రధాని మోదీ ప్రజా ప్రస్థానం ప్రారంభమైంది. అప్పటి నుంచి 2014లో దేశ ప్రధానిగా బాధ్యతలు చేపట్టి, 25 ఏళ్లుగా తన సేవలను దిగ్విజయంగా కొనసాగిస్తున్నారు. ఈ మైలురాయిని పురస్కరించుకుని, ప్రధాని మోదీకి అమ్మవారి సంపూర్ణ ఆశీస్సులు లభించాలని, ఆయనకు ఆయురారోగ్యాలు, దీర్ఘాయుష్షు ప్రసాదించాలని ఆకాంక్షిస్తూ ఈ పూజలు జరపనున్నారు. దేశాన్ని 'వికసిత్ భారత్' లక్ష్యం వైపు నడిపిస్తున్న ఆయన నాయకత్వం మరింత బలోపేతం కావాలన్నది ఈ పూజల ముఖ్యఉద్దేశం. ఈ సందర్భంగా అక్టోబర్ 7వ తేదీ తెల్లవారుజామున బ్రహ్మ ముహూర్తంలో అమ్మవారి అంతరాలయంలో అత్యంత విశిష్టమైన 'ఖడ్గమాల అర్చన'ను ప్రధాని పేరిట జరపనున్నారు. జగద్గురువు ఆది శంకరాచార్యులు ఇంద్రకీలాద్రిపై ప్రతిష్టించిన శ్రీచక్రానికి ఖడ్గమాల స్తోత్రంతో పూజలు నిర్వహిస్తే అమ్మవారి అనుగ్రహంతో పాటు ఆధ్యాత్మిక శక్తి, రక్షణ, శాంతి, సంకల్పసిద్ధి కలుగుతాయని భక్తుల ప్రగాఢ విశ్వాసం. ప్రధాని మోదీ నిరంతర దేశ సేవకు కనకదుర్గమ్మ ఆశీస్సులు ఎల్లవేళలా ఉండాలని, ఆయన నాయకత్వంలో భారతదేశం మరింత సుసంపన్నమైన, ఆత్మనిర్భర దేశంగా ఎదగాలన్న సంకల్పంతో ఎంపీ లింగమనేని రమేశ్ ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ పూజల ద్వారా ప్రధానికి సంపూర్ణ ఆరోగ్యం, శక్తి సామర్థ్యాలు లభించాలని ఆకాంక్షించారు.



# పోలీసు బస్సు తాళాలు లాక్కెళ్లిన మహిళ..

జంతర్ మంతర్ వద్ద ఉద్రిక్తత!
ఢిల్లీ జంతర్ మంతర్ వద్ద నిరసన
పోలీసు బస్సు తాళాలు లాక్కెళ్లిన మహిళ
ఈ ఘటనకు సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్
మహిళ చర్యపై మిశ్రమ స్పందనలు

ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద నిరసనలో పాల్గొన్న ఓ మహిళా కార్యకర్త చేసిన సాహసం ఇప్పుడు దేశవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారింది. ఆందోళనకారులను తరలిస్తున్న పోలీసు బస్సు తాళం చెవిని ఆమె లాక్కొని, వాహనం కదలకుండా అడ్డుకున్నారు. ఈ ఘటనకు సంబంధించిన వీడియో ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. ఓటర్ల జాబితా (ఎలక్టోరల్ రోల్) సవరణలు, ఎన్నికల కమిషన్‌కు సంబంధించిన పలు డిమాండ్లతో ఢిల్లీలో కొందరు నిరసన చేపట్టారు. ఈ క్రమంలో పోలీసులు భారీగా మోహరించి, పలువురు ఆందోళనకారులను అదుపులోకి తీసుకున్నారు. వారిని బస్సులో ఎక్కించి అక్కడి నుంచి తరలించేందుకు సిద్ధమవుతుండగా, ఓ మహిళ ఒక్కసారిగా డ్రైవర్ వద్దకు వెళ్లి తాళం చెవిని లాక్కున్నారు.ఆ వెంటనే ఆమె జనం మధ్యలోకి వెళ్లిపోవడంతో బస్సు ముందుకు కదలలేదు. తాళం చెవి కోసం కొందరు ఆమెను వెంబడించినా ఫలితం లేకపోయింది. ఈ అనూహ్య పరిణామం అంతా కెమెరాలో రికార్డయింది. ప్రస్తుతం ఈ వీడియో సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతోంది. ఆమె తెగువను కొందరు ప్రశంసిస్తుండగా, చట్టాన్ని చేతుల్లోకి తీసుకోవడం సరైంది కాదని మరికొందరు అభిప్రాయపడుతున్నారు.

## ప్రజా సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం తగదు

మీకోసంలో డీఆర్వో రమణ అధికారులకు ఆదేశం

ఒంగోలు, సింధూరదర్శిని: ప్రజా సమస్యల పరిష్కార వేదిక ద్వారా ప్రజల నుంచి స్వీకరించిన ప్రతి అర్జీపై జిల్లా యంత్రాంగం ప్రత్యేక దృష్టి సారించి, నిర్ణీత కాలవ్యవధిలో పారదర్శకంగా పరిష్కరించాలని జిల్లా రెవెన్యూ అధికారి పి.వి. రమణ ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని గ్రీవెన్స్ హాలులో నిర్వహించిన 'ప్రజా సమస్యల పరిష్కార వేదిక' కార్యక్రమంలో ఆయన పాల్గొని, జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల నుంచి వినతులను స్వయంగా స్వీకరించారు. ఈ కార్యక్రమంలో మొత్తం 303 అర్జీలు వచ్చాయి. ఈ సందర్భంగా డి.ఆర్.ఓ మాట్లాడుతూ, సోమవారం గ్రీవెన్స్‌కు వచ్చే అర్జీదారుల సమస్యలను క్షేత్రస్థాయి పరిశీలన ద్వారా మాత్రమే శాశ్వతంగా పరిష్కరించగలమని పేర్కొన్నారు. అర్జీలు కేవలం కాగితాలకే పరిమితం కాకుండా చట్టపరిధిలో నాణ్యమైన పరిష్కారం లభించేలా చూసే బాధ్యత అధికారులపైనే ఉందన్నారు. ఒకసారి సమర్పించిన అర్జీలు మళ్లీ మళ్లీ అదే సమస్యపై రాకుండా చూడాలని, మొదటిసారే సంబంధిత అధికారులు పూర్తిస్థాయిలో విచారణ జరిపి అర్జీదారులకు స్పష్టమైన, సంతృప్తికరమైన పరిష్కారం అందించాలని ఉద్ఘాటించారు. ఈ కార్యక్రమంలో జిల్లా విపత్తు నిర్వహణ అధికారి మాధురి, జిల్లా పరిషత్ సీఈఓ చిరంజీవి, జిల్లా పంచాయతీ అధికారి అనుపమ, పలు శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

# ఆ దాడులకు నాకు సంబంధం లేదు.. ఐటీ సోదాలపై రకుల్ ప్రీత్ సింగ్ ఫైర్!

తనపై ఐటీ దాడులు జరిగాయన్న వార్తలను ఖండించిన రకుల్
ఆ సోదాలు తన గురించి కాదని సోషల్ మీడియాలో స్పష్టీకరణ
తాను ఆర్మీ కుటుంబం నుంచి వచ్చానని, ఎలాంటి గాడ్‌ఫాదర్ లేరని వెల్లడి
విదేశీ లావాదేవీలు, బినామీ ఆస్తులతో తనకు సంబంధం లేదన్న నటి
తప్పుడు కథనాలు ప్రచురించిన మీడియా వాటిని వెనక్కి తీసుకోవాలని డిమాండ్



తన పేరును ఆదాయపు పన్ను (ఐటీ) శాఖ సోదాలతో ముడిపెడుతూ వస్తున్న వార్తలపై బాలీవుడ్ నటి రకుల్ ప్రీత్ సింగ్ తీవ్రంగా స్పందించారు. సోషల్ మీడియా వేదికగా ఒక ప్రకటన విడుదల చేస్తూ, ఈ వార్తల్లో ఎలాంటి నిజం లేదని, ఆ సోదాలకు తనకు ఎలాంటి సంబంధం లేదని స్పష్టం చేశారు. వాస్తవాలను నిర్ధారించుకోకుండా కొన్ని మీడియా సంస్థలు, ఆన్‌లైన్ రిపోర్టర్లు వార్తలను సంచలనం చేస్తున్నారని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. "కొందరు ఆన్‌లైన్ రిపోర్టర్లు, కొన్ని ప్రధాన మీడియా సంస్థల్లో వాస్తవాలను నిర్ధారించుకోకుండా వార్తలను సంచలనం చేసే ధోరణి పెరుగుతుండటం బాధాకరం. అందుకే ఒకేసారి అందరికీ స్పష్టత ఇవ్వాలనుకుంటున్నాను. ఆ సోదాలు నాకు సంబంధించినవి కావు" అని రకుల్ తన ప్రకటనలో పేర్కొన్నారు. తన నేపథ్యం గురించి వివరిస్తూ.. "నేను ఆర్మీ కుటుంబం నుంచి వచ్చాను. ఇండస్ట్రీలో నాకు ఎలాంటి గాడ్‌ఫాదర్ లేరు. కేవలం నా కష్టంతోనే ఈ స్థాయికి వచ్చాను. చట్టాన్ని గౌరవించే పౌరురాలిగా 20 ఏళ్ల వయసు నుంచే క్రమం తప్పకుండా పన్నులు చెల్లిస్తున్నాను" అని ఆమె తెలిపారు. ఆర్థిక అవకతవకల ఆరోపణలను కూడా ఆమె ఖండించారు. "వ్యక్తిగతంగా గానీ, ఏ నిర్మాణ సంస్థ తరఫున గానీ నేను ఎలాంటి అక్రమ విదేశీ లావాదేవీలలో పాలుపంచుకోలేదు. దేశంలో లేదా విదేశాల్లో ఎవరి పేరు మీద కూడా నేను బినామీ ఆస్తులు కలిగి లేను. నాకు ఎవరూ ఎప్పుడూ ఎలాంటి ఆస్తులను బహుమతిగా ఇవ్వలేదు. అలాంటి ఖరీదైన బహుమతులు తీసుకోకూడదన్నది నా నియమం" అని రకుల్ స్పష్టం చేశారు. ఈ సందర్భంగా మీడియా తీరుపై ఆమె అసంతృప్తి వ్యక్తం చేశారు. "నా గురించి తప్పుడు, దురుద్దేశపూర్వక కథనాలు ప్రచురించిన వారందరూ వాటిని వెనక్కి తీసుకుని, వాస్తవాలను స్పష్టం చేయాలని కోరుతున్నాను. మీడియా వ్యాపారంలో ఎంత పెద్ద సంస్థకైనా ఆర్థిక ఒత్తిళ్లు ఉంటాయని నేను అర్థం చేసుకోగలను. కానీ అది వాస్తవాలను పణంగా పెట్టి జరగకూడదు. ఒకరి ప్రతిష్ఠ, జీవనోపాధిని దెబ్బతీసేలా అసలే ఉండకూడదు" అని ఆమె హితవు పలికారు. కాగా, ముంబైలో నటి రకుల్ ప్రీత్ సింగ్, ఆమె మామ, సినీ నిర్మాత వాషు భగ్నానీ, పనోరమా స్టూడియోస్‌కు సంబంధించిన పలు ప్రాంతాల్లో ఆదాయపు పన్ను శాఖ సోదాలు నిర్వహించినట్లు ఇటీవల వార్తలు వచ్చాయి. ఆర్థిక అవకతవకల ఆరోపణలపై ముంబై ఐటీ విభాగం సుమారు 12 ప్రాంతాల్లో ఈ తనిఖీలు చేపట్టినట్లు సమాచారం. సినిమా ఫైనాన్సింగ్ పేరుతో నిధులను అక్రమంగా విదేశాలకు తరలించారన్న ఆరోపణలపై ఈ దర్యాప్తు జరుగుతున్నట్లు తెలుస్తోంది. ఈ నేపథ్యంలోనే తనపై వచ్చిన వార్తలను రకుల్ ఖండించారు.

# ఇండిగో ప్రయాణికులకు షాక్.. భారీగా పెరిగిన ఛార్జీలు

ఇండిగో ప్రయాణికులకు షాక్.. భారీగా పెరిగిన ఛార్జీలు - ఇండిగో విమానాల్లో ఫ్యూయల్ సర్‌చార్జ్ పెంపు
ఏటీఎఫ్ ధరలు పెరగడమే ఇందుకు కారణం - అక్టోబర్ 6 నుంచి అమల్లోకి రానున్న కొత్త ఛార్జీలు
దేశీయ, అంతర్జాతీయ సర్వీసులకు వర్తించనున్న పెంపు - గత నెలతో పోలిస్తే 14 శాతానికి పైగా పెరిగిన ఇంధన ధరలు

దేశీయ విమానయాన రంగంలో అగ్రగామి సంస్థ అయిన ఇండిగో, ప్రయాణికులపై అదనపు భారాన్ని మోపనుంది. విమాన ఇంధనం (ఏటీఎఫ్) ధరలు భారీగా పెరగడంతో ఫ్యూయల్ సర్‌చార్జ్‌ను పెంచుతున్నట్లు సోమవారం ప్రకటించింది. ఈ నూతన ఛార్జీలు అక్టోబర్ 6వ తేదీ నుంచి చేసే అన్ని కొత్త బుకింగ్‌లకు వర్తిస్తాయని సంస్థ స్పష్టం చేసింది. గత కొన్ని నెలలుగా ఏటీఎఫ్ ధరలు నిరంతరాయంగా పెరుగుతున్నాయని, గత నెలతో పోలిస్తే తాజాగా 14 శాతానికి పైగా ధర పెరిగిందని ఇండిగో ఒక ప్రకటనలో తెలిపింది. గడిచిన దశాబ్ద కాలంలో ఇదే అత్యధికమని పేర్కొంది. విమానయాన సంస్థల నిర్వహణ వ్యయంలో ఇంధన ఖర్చులే కీలకమని, ఈ పెరుగుదల తమ సంస్థతో పాటు మొత్తం ఏవియేషన్ రంగంపై తీవ్ర ప్రభావం చూపుతుందని వివరించింది.




నూతన ఛార్జీల ప్రకారం.. దేశీయ మార్గాల్లో 500 కిలోమీటర్ల వరకు ప్రయాణించే వారిపై రూ. 375... 501 నుంచి 1,000 కిలోమీటర్ల వరకు రూ. 600 వసూలు చేయనున్నారు. అదేవిధంగా, 1,001-1,500 కి.మీ. ప్రయాణానికి రూ. 900... 1,501-2,000 కి.మీ. దూరానికి రూ. 1,150... 2,000 కిలోమీటర్లు దాటిన ప్రయాణాలకు రూ. 1,300 చొప్పున ఫ్యూయల్ సర్‌చార్జ్ వర్తిస్తుంది. అంతర్జాతీయంగా సార్క్ దేశాలకు రూ. 1,000 నుంచి రూ. 3,000 వరకు, సౌత్ ఈస్ట్ ఆసియా, గల్ఫ్, మిడిల్ ఈస్ట్ దేశాలకు రూ. 5,500, ఆఫ్రికా, యూరప్ దేశాలకు రూ. 6,000 ఫ్యూయల్ ఛార్జ్‌ను నిర్ణయించారు. వాస్తవానికి పెరిగిన ఇంధన వ్యయాన్ని భర్తీ చేయడానికి ఇంకా అధిక మొత్తంలో ఛార్జీలు పెంచాల్సి ఉన్నప్పటికీ, ప్రయాణికులపై భారాన్ని తగ్గించే ఉద్దేశంతోనే పరిమితంగా సర్దుబాటు చేసినట్లు ఇండిగో వెల్లడించింది.

# ఓపెన్‌ఏఐకి షాక్: ఏఐతో పెను ప్రమాదమంటూ సేఫ్టీ సిస్టమ్స్ టీమ్ కీలక ఉద్యోగి రాజీనామా

కంపెనీ కల్చర్ దెబ్బతిన్నదని, భద్రతను విస్మరిస్తున్నారని ఆరోపణ
వేగవంతమైన ఆవిష్కరణల కోసం ప్రమాదాలను పట్టించుకోవడం లేదని విమర్శ
ఏఐ రంగంలో అణుశక్తి, విమానయానం తరహా భద్రతా ప్రమాణాలు అవసరమని సూచన
ఈ రాజీనామాతో ఏఐ పరిశ్రమలో ఆవిష్కరణ, భద్రత మధ్య చర్చ తీవ్రతరం

ప్రముఖ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) సంస్థ ఓపెన్‌ఏఐకి గట్టి ఎదురుదెబ్బ తగిలింది. ఆ సంస్థ సేఫ్టీ సిస్టమ్స్ విభాగంలో కీలక బాధ్యతలు నిర్వహించిన డేవిడ్ రాబిన్సన్ తన పదవికి రాజీనామా చేశారు. సంస్థ వేగవంతమైన వృద్ధికి ఇస్తున్న ప్రాధాన్యతను భద్రతాపరమైన ముప్పులను అరికట్టడంలో చూపడం లేదని ఆయన తీవ్ర ఆరోపణలు చేశారు. ఈ మేరకు "నేను ఓపెన్‌ఏఐని వీడాను, ఎందుకంటే దాని సంస్కృతి దెబ్బతింది" అనే శీర్షికతో ఒక పత్రికలో ఆయన వ్యాసం రాశారు. సుమారు మూడున్నర ఏళ్లుగా ఓపెన్‌ఏఐలో పనిచేస్తున్న రాబిన్సన్, సంస్థ పనితీరుపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. "ఏఐ కంపెనీలు తగినంత జాగ్రత్తగా వ్యవహరించడం లేదు. ఇది కేవలం నిబంధనలకు సంబంధించిన సమస్య మాత్రమే కాదు, సంస్థాగత సంస్కృతిలోనే లోపముంది" అని ఆయన విమర్శించారు. నూతన ఉత్పత్తులను మార్కెట్లోకి విడుదల చేసిన తర్వాత, సమస్యలు తలెత్తినప్పుడు భద్రతా చర్యలు చేపట్టే విధానాన్ని ఆయన తప్పుబట్టారు. ఏఐ మోడల్స్ సామర్థ్యం పెరిగేకొద్దీ, ప్రయోగాల్లో వైఫల్యాలు సంభవిస్తే వాటి వల్ల కలిగే నష్టం ఊహించలేనంతగా ఉంటుందని ఆయన హెచ్చరించారు. "పరీక్షించి, తప్పులు సరిదిద్దుకునే సమయం ముగిసింది" అని పేర్కొంటూ, అణు విద్యుత్ లేదా విమానయాన రంగాలలో అనుసరించే కఠినమైన భద్రతా ప్రమాణాలు ఏఐ రంగంలోనూ అత్యవసరమని ఆయన అభిప్రాయపడ్డారు. ఇటీవల ట్రయల్స్ సమయంలో ఓపెన్‌ఏఐ ఏజెంట్లు మరో ఏఐ స్టార్టప్ అయిన 'హగ్గింగ్ ఫేస్'పై దాడికి ప్రయత్నించినట్లు వెలుగులోకి వచ్చిన ఉదంతాలను ఆయన ఈ సందర్భంగా ప్రస్తావించారు. ఈ ఆరోపణలపై ఓపెన్‌ఏఐ ప్రతినిధి స్పందిస్తూ, తాము సురక్షితంగా నియంత్రించగలిగే పరిమితులకు మించి మోడల్స్ శక్తివంతంగా మారకుండా తగిన జాగ్రత్తలు తీసుకుంటామని, అవసరమైతే వాటి శిక్షణను కూడా నిలిపివేస్తామని స్పష్టం చేశారు. రాబిన్సన్ రాజీనామాతో ఏఐ రంగంలో ఆవిష్కరణలు, భద్రతా ప్రమాణాల మధ్య ఉండాల్సిన సమతుల్యంపై మరోసారి చర్చ మొదలైంది.



# నెల్లూరు జిల్లాలో అద్భుత సన్నివేశం

శివలింగం చుట్టూ మూడు నాగుపాముల ప్రదక్షిణ
నెల్లూరు జిల్లా మనుబోలులోని కాశీ విశ్వనాథ ఆలయంలో ఘటన
ప్రదక్షిణ తర్వాత ఆలయంలోని పుట్టలోకి వెళ్లిన నాగుపాములు
గతంలోనూ ఇదే ఆలయంలో పలుమార్లు కనిపించిన నాగసర్పాలు

నెల్లూరు, సింధూరదర్శిని: జిల్లాలో ఓ శివాలయంలో నేడు అద్భుత దృశ్యం ఆవిష్కృతమైంది. మనుబోలు బీసీ కాలనీ సమీపంలోని శ్రీకాశీ విశ్వనాథ స్వామి ఆలయంలో ఈరోజు ఉదయం మూడు నాగుపాములు శివలింగం చుట్టూ ప్రదక్షిణ చేస్తూ కనిపించాయి. శివలింగాన్ని చుట్టుకొని, కొద్దిసేపు అక్కడే పడగవిప్పి ఉన్న సర్పాలను చూసి భక్తులు ఆశ్చర్యపోయారు. అనంతరం ఆ మూడు పాములు ఆలయంలోనే ఉన్న పుట్టలోకి వెళ్లిపోయాయి. ఈ అరుదైన దృశ్యాన్ని కొందరు భక్తులు తమ ఫోన్లలో వీడియో తీయడంతో అది కాస్తా సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. విషయం తెలుసుకున్న చుట్టుపక్కల ప్రాంతాల ప్రజలు ఆలయానికి పెద్ద సంఖ్యలో తరలివచ్చి స్వామివారిని దర్శించుకుంటున్నారు. శివుడికి ప్రీతిపాత్రమైన సోమవారం రోజే ఇలా మూడు నాగసర్పాలు కనిపించడం దైవ సంకేతంగా భక్తులు భావిస్తున్నారు. ఈ ఆలయంలో నాగుపాములు కనిపించడం ఇదే మొదటిసారి కాదు. గత ఏడాది మే 17న కూడా అభిషేకం తర్వాత శివలింగంపై ఓ నాగుపాము పడగవిప్పి దర్శనమిచ్చింది. అలాగే, గతేడాది అక్టోబర్‌లో నాగుల చవితి రోజున రెండు నాగుపాములు శివలింగం పక్కన కనిపించి భక్తులను ఆశ్చర్యపరిచాయి. తరచూ ఇలా నాగసర్పాలు దర్శనమివ్వడం ఆ క్షేత్ర మహత్యంగా స్థానికులు చెబుతున్నారు.

# జేబులో 37 రూపాయలు... గుండెల్లో ఆకాశమంత ఆశయం: ఇదీ అనుపమ్ ఖేర్ కథ!



ఇంటి అద్దె కట్టలేక సామాన్లతో బయటకు గెంటేస్తే బీచ్‌లో నిద్రించిన రోజులు

తొలి చిత్రం 'సారాంశ్' నుంచి తొలగించినా పోరాడి సాధించిన విజయం

కిరణ్ ఖేర్‌తో స్నేహం వివాహ బంధంగా మారిన వైనం

500 చిత్రాలు, జాతీయ అవార్డులు, పద్మ పురస్కారాలతో శిఖర స్థాయికి

కలల నగరం ముంబైలో అడుగుపెట్టే ప్రతి ఒక్కరి కళ్లలోనూ ఓ ఆశ మెరుస్తుంటుంది. కానీ, జేబులో చిల్లి గవ్వ లేనప్పుడు ఆ ఆశను నిలబెట్టుకోవడం కత్తి మీద సాము లాంటిది. అలాంటి స్థితి నుంచి, అంటే కేవలం 37 రూపాయలతో ముంబై వచ్చి, భారత సినీ రంగంలో తనకంటూ ఓ ప్రత్యేకఅధ్యాయాన్ని లిఖించుకున్న నటుడు అనుపమ్‌ఖేర్. ఆయన ప్రస్థానం ఎందరికో స్ఫూర్తిదాయకం. సిమ్లా నుంచి నేషనల్ స్కూల్ ఆఫ్ డ్రామాలో శిక్షణ పూర్తి చేసుకుని, నటుడిగా తన అదృష్టాన్ని పరీక్షించుకోవడానికి అనుపమ్ ఖేర్ ముంబై రైలు దిగారు. అప్పుడు ఆయన జేబులో ఉన్నది కేవలం 37 రూపాయలు. కానీ, ఆయన గుండెల్లో ఆశ మాత్రం ఆకాశమంత ఉంది. అయితే, ముంబై వాస్తవికత ఆయన ఊహకు భిన్నంగా ఉంది. అవకాశాల కోసం కాళ్లరిగేలా తిరిగినా, తిరస్కరణలే ఎదురయ్యాయి. ఆనాటి కష్టాలే తనకు పట్టుదలను నేర్పాయని ఆయన చాలాసార్లు గుర్తుచేసుకున్నారు.

**అధఃపాతాళం చూసిన రోజులు**

1983లో ముంబైలో తన తల్లి, సోదరుడు, మరో ఇద్దరు స్నేహితులతో కలిసి అనుపమ్ ఖేర్ ఒకే గదిలో ఉండేవారు. మూడు నెలల పాటు ఇంటి అద్దె కట్టలేని పరిస్థితి. ఇంటి యజమాని వారి సామాన్లను బయట పడేసి తలుపులు మూసేశారు. ఆ రోజు సాయంత్రానికి ఎలాగైనా రూ.2,100 సంపాదించాల్సిన దుస్థితి. తలదాచుకోవడానికి చోటులేక, చివరికి ఓ పేపర్ పరుచుకుని బీచ్‌లోనే నిద్రపోయిన చేదు అనుభవం ఆయనది. సినీ రంగ ప్రవేశానికి ముందు లక్నోలోని ఓ ఆలయంలో నటి మధుమాలిని కపూర్‌ను అనుపమ్ వివాహం చేసుకున్నారు. రెండేళ్ల ప్రేమ తర్వాత వారి వివాహం జరిగినా, పెళ్లైన మరుసటి రోజే తాను ఇక్కడ ఉండలేనని చెప్పి ముంబైకి తిరిగి వచ్చేశారు. ఆ వివాహం ఒక్క రోజులోనే ముగిసిపోయిందని ఆయన సోదరుడు రాజు ఖేర్ ఓ సందర్భంలో వివరించారు.

**'సారాంశ్'తో మారిన జీవితం**

అనుపమ్ ఖేర్ కెరీర్‌ను మలుపుతిప్పిన చిత్రం 'సారాంశ్' (1984). ఈ సినిమా అవకాశం కూడా ఆయనకు అంత సులభంగా దక్కలేదు. 28 ఏళ్ల వయసులో, 65 ఏళ్ల వృద్ధుడి పాత్ర కోసం ఆరు నెలల పాటు కఠోర సాధన చేశారు. అయితే, షూటింగ్‌కు కేవలం 10 రోజుల ముందు ఆపాత్రకు అప్పటికే స్టార్‌గా ఉన్న సంజీవ్ కుమార్‌ను తీసుకుంటున్నారని తెలిసి కుప్పకూలిపోయారు. తీవ్ర నిరాశతో ముంబై విడిచి వెళ్లిపోవాలని నిర్ణయించుకున్నారు. కానీ, వెళ్లే ముందు ధైర్యం చేసి దర్శకుడు మహేశ్ భట్‌ను నిలదీశారు. తన ఆవేదనను, పాత్ర కోసం పడిన తపనను వివరించారు. ఆయనలోని నటుడిని గుర్తించిన భట్, తిరిగి ఆ పాత్రను అనుపమ్‌కే ఇచ్చారు. కొడుకును కోల్పోయిన తండ్రిగా ఆయన నటన విమర్శకుల ప్రశంసలు అందుకుంది. ఆ చిత్రం 1985లో ఆస్కార్‌కు భారతదేశం తరఫున అధికారిక ఎంట్రీగా నిలిచింది.

**కిరణ్ ఖేర్‌తో బంధం**

చండీగఢ్‌లో థియేటర్ ఆర్టిస్టులుగా ఉన్నప్పుడే అనుపమ్, కిరణ్ ఖేర్ మంచి స్నేహితులు. అప్పట్లో ఇద్దరూ వేర్వేరు వివాహ బంధాల్లో ఉన్నారు. కాలక్రమేణా ఇద్దరి వైవాహిక జీవితాల్లో సమస్యలు తలెత్తాయి. సరిగ్గా అదే సమయంలో తాను ఆమెతో ప్రేమలో పడ్డానని అనుపమ్ చెప్పడంతో, వారి స్నేహం ప్రేమగా మారింది. 1985 ఆగస్టు 26న వారు వివాహం చేసుకున్నారు. అప్పటికి అనుపమ్ ఆర్థికంగా ఇంకా నిలదొక్కుకోలేదు. అయినా, కిరణ్ ఆయనకు తోడుగా నిలిచారు. కిరణ్ మొదటి వివాహం ద్వారా కలిగిన కుమారుడు సికిందర్‌ను కూడా అనుపమ్ తన సొంత కొడుకులా చూసుకున్నారు. వారి బంధం నాలుగు దశాబ్దాలుగా బలంగా కొనసాగుతోంది.

**శిఖర స్థాయికి ప్రస్థానం**

కేవలం రూ. 37తో మొదలైన ప్రస్థానం, ఆయనను బాలీవుడ్ శిఖరాలకు చేర్చింది. కర్మ, రామ్ లఖన్, లమ్హే, హమ్ ఆప్కే హై కౌన్, దిల్‌వాలే దుల్హనియా లే జాయేంగే, ఎ వెడ్నెస్‌డే వంటి చిత్రాలతో తన నటనలోని విలక్షణతను చాటుకున్నారు. 2016 నాటికే 500 చిత్రాల మైలురాయిని దాటారు. ఆయన నటనకు గుర్తింపుగా రెండు జాతీయ అవార్డులు వరించాయి. భారత ప్రభుత్వం 2004లో పద్మశ్రీ, 2016లో పద్మభూషణ్ పురస్కారాలతో సత్కరించింది. 2005లో 'యాక్టర్ ప్రిపేర్స్' పేరుతో ఓ యాక్టింగ్ స్కూల్‌ను స్థాపించి, ఎంతో మంది యువ నటులకు మార్గనిర్దేశం చేస్తున్నారు. బీచ్‌లో నిద్రించిన ఓ యువకుడు, నేడు పద్మభూషణ్ గ్రహీతగా, భారతీయ సినిమా గర్వించదగ్గ నటుడిగా నిలవడం నిజంగా ఓ అద్భుతం.

# ట్యాబ్లెట్లను మెరిసే అల్యూమినియం ఫాయిల్‌తోనే ఎందుకు ప్యాక్ చేస్తారు?

మందుల స్ట్రిప్‌లో ఫాయిల్ కీలక రక్షణ పొర - తేమ, గాలి, వెలుతురు నుంచి మందును కాపాడే ఫాయిల్

అల్యూమినియం చాలా పలుచగా ఉన్నా బలమైన రక్షణ - ఫాయిల్ వల్ల మందు ఎక్స్‌పైరీ తేదీ పెరగదన్న నిపుణులు

అందుబాటులో ఉండడం, సులభమైన తయారీ కోసం ఓ కారణం



మందుల స్ట్రిప్ చేతిలోకి తీసుకున్నప్పుడు వెనుక కనిపించే మెరిసే వెండి రంగు పొరను మనం తరచూ చూస్తుంటాం. కానీ అది ఎందుకు ఉంటుందో చాలామందికి తెలియదు.

అది కేవలం మందుల ప్యాకింగ్ కోసం పెట్టే సాధారణ ఫాయిల్ కాదు. మందు నాణ్యత దెబ్బతినకుండా కాపాడటంలో దీనికి చాలా ముఖ్యమైన పాత్ర ఉంది.

**తేమ, గాలి, వెలుతురు నుంచి రక్షణ**

కొన్ని మందులు తేమ, గాలి, వెలుతురుకు చాలా సున్నితంగా ఉంటాయి. ఇవి మందులోని పదార్థాలపై ప్రభావం చూపి దాని నాణ్యతను తగ్గించవచ్చు. అందుకే అల్యూమినియం ఫాయిల్‌ను రక్షణ కవచంలా ఉపయోగిస్తారు. ఇది బయటి వాతావరణం మందులోకి చేరకుండా అడ్డుకుంటుంది.

**పలుచగా ఉన్నా.. రక్షణ ఎక్కువ**

అల్యూమినియంను చాలా పలుచని పొరగా తయారు చేయొచ్చు. అయినా ఇది తేమ, గాలి, వెలుతురును అడ్డుకోవడంలో సమర్థంగా పనిచేస్తుంది. అందుకే మందుల స్ట్రిప్‌ల తయారీలో దీనిని విస్తృతంగా వాడుతున్నారు. అందుబాటులో ఉండటం, తయారు చేయడం సులభం కావడం కూడా మరో కారణం.

**అన్ని మందులకూ ఒకే ప్యాకింగ్ కాదు**

ప్రతి మందును అల్యూమినియం ఫాయిల్‌లోనే ప్యాక్ చేయరు. మందు స్వభావం, దానికి అవసరమైన నిల్వ పరిస్థితులను బట్టి ప్యాకింగ్‌ను ఎంచుకుంటారు. కొన్ని మందులను బాటిళ్లలో పెడతారు. మరికొన్నింటిని సాధారణ బ్లిస్టర్ ప్యాక్‌లలో విక్రయిస్తారు.

**రెండు వైపులా ఫాయిల్ ఎందుకు?**

కొన్ని మందులకు మరింత ఎక్కువ రక్షణ అవసరం ఉంటుంది. అలాంటి మందులకు రెండు వైపులా అల్యూమినియం ఫాయిల్ ఉండే ప్యాక్‌ను వాడతారు. ఇది తేమ, గాలి, వెలుతురు నుంచి మరింత బలమైన రక్షణ ఇస్తుంది.

**ఎక్స్‌పైరీ తేదీ పెరుగుతుందా?**

అల్యూమినియం ఫాయిల్ వాడటం వల్ల మందు ఎక్స్‌పైరీ తేదీ పెరగదు. మందు ఎంతకాలం నాణ్యత, భద్రత, ప్రభావాన్ని నిలబెట్టుకుంటుందో కంపెనీలు ముందుగానే పరీక్షిస్తాయి. ఆ కాలం వరకు మందు సురక్షితంగా ఉండేందుకు ప్యాకింగ్ రక్షణ కల్పిస్తుంది.

# భూమిపై భారీ ఉల్కాపాతం.. వయసు లెక్కింపులో 10 కోట్ల సంవత్సరాలు తక్కువగా నిర్ధారణ

ఓక్లహోమాలోని ఏమ్స్ ఉల్కాపాతం క్రేటర్ వయసుపై కొత్త పరిశోధన

గత అంచనా కంటే 10 కోట్ల సంవత్సరాలు తక్కువ వయసు అని నిర్ధారణ

గతంలో 46.7 కోట్లు ఏళ్లు కాగా, ఇప్పుడు 37 కోట్ల ఏళ్ల క్రితం ఏర్పడినట్లు గుర్తింపు

జిర్కాన్ డేటింగ్ పద్ధతి ద్వారా శాస్త్రవేత్తల తాజా అంచనా

భారీ జీవరాశుల వినాశనం జరిగిన కాలానికి దగ్గరగా ఈ సంఘటన



అమెరికాలోని ఓక్లహోమాలో ఉన్న ఏమ్స్ ఉల్కాపాతం క్రేటర్ (బిలం) వయసును శాస్త్రవేత్తలు సవరించారు. గతంలో భావించినట్లుగా ఇది 46.7 కోట్ల ఏళ్ల క్రితం కాకుండా, సుమారు 37 కోట్ల ఏళ్ల క్రితం ఏర్పడిందని టెక్సాస్ విశ్వవిద్యాలయం పరిశోధకులు తేల్చారు. అంటే, ఇప్పటివరకు ఉన్న అంచనా కంటే దీని వయసు దాదాపు 10 కోట్ల సంవత్సరాలు తక్కువ. ఈ కొత్త ఆవిష్కరణతో, భూమిపై భారీస్థాయిలో జీవరాశులు అంతరించిన కాలానికి ఈ ఉల్కాపాత సంఘటన దగ్గరగా జరిగినట్లు తెలుస్తోంది. ఓక్లహోమాలోని ఏమ్స్ పట్టణం కింద కొన్ని మైళ్ల వెడల్పున ఈ బిలం విస్తరించి ఉంది. దశాబ్దాలుగా ఈ బిలం 'ఆర్డోవిషియన్ ఉల్కాపాత ఘటన'కు సంబంధించిందని భావిస్తూ వచ్చారు. ఆ బిలంలో లభించిన పురాతన జీవుల దంతాల అవశేషాల (కానోడాంట్ శిలాజాలు) ఆధారంగా గతంలో వయసును లెక్కించారు. అయితే, ఎలిజబెత్ క్యాట్లాస్ నేతృత్వంలోని పరిశోధక బృందం, ఉల్కాపాతం వల్ల కరిగిన రాళ్లలోని జిర్కాన్ స్ఫటికాలపై యురేనియం-లెడ్ డేటింగ్ పద్ధతిని ఉపయోగించి కొత్త వయసును కనుగొంది. తాజా పరిశోధన ప్రకారం, ఈ బిలం వయసు 36.97 కోట్ల సంవత్సరాలుగా నిర్ధారణ అయింది. ఉల్కాపాతం జరిగినప్పుడు, అంతకుముందే అక్కడ ఉన్న శిలల్లోని పాత శిలాజాలు బిలంలో కలిసిపోయాయని, అందుకే పాత అంచనాలు తప్పుగా వచ్చాయని శాస్త్రవేత్తలు వివరిస్తున్నారు. ఈ కొత్త కాలక్రమం ప్రకారం, ఈ ఉల్కాపాతం సుమారు 37.2 కోట్ల ఏళ్ల క్రితం సముద్ర జీవరాశిని నాశనం చేసిన భారీ వినాశనానికి దగ్గరగా జరిగింది. ఈ ఉల్కాపాతమే ఆ జీవరాశుల వినాశనానికి కారణమని కచ్చితంగా చెప్పలేనప్పటికీ, ఆ విపత్కర కాలంలోనే ఇది జరగడం కీలక పరిణామమని పరిశోధకులు అంటున్నారు. నమూనాలు పరిమితంగా ఉన్నందున, మరిన్ని పరిశోధనలు చేస్తే ఈ అంచనాలు మరింత బలపడతాయని వారు పేర్కొన్నారు. ఈ కొత్త ఆవిష్కరణ ఉత్తర అమెరికాలో పురాతన ఉల్కాపాతాల విస్తరణపై అవగాహనను కూడా మార్చనుంది.

# మహిళలపై నేరాలను అరికట్టండి..

దుండగులకు వణుకు పుట్టాలి: సుప్రీంకోర్టు

సామాజిక వ్యతిరేక శక్తుల్లో భయం సృష్టించాలని ఢిల్లీ పోలీసులకు సుప్రీంకోర్టు సూచన

ఢిల్లీ-ఎన్‌సీఆర్‌లో అత్యాచార ఘటనలపై సుమోటోగా విచారణ చేపట్టిన ధర్మాసనం

నేరం జరిగాక చర్యల కన్నా నివారణే ముఖ్యమని స్పష్టం చేసిన కోర్టు

బీట్ పెట్రోలింగ్, నిఘా పెంచాలని, చీకటి ప్రదేశాలపై దృష్టి పెట్టాలని ఆదేశం

చట్టవిరుద్ధ తినుబండారాల కేంద్రాల వద్ద పోకిరీల ఆగడాలను అరికట్టాలని సూచన



మహిళలపై నేరాలకు పాల్పడే సామాజిక వ్యతిరేక శక్తుల మనసుల్లో భయాన్ని సృష్టించాల్సిన అవసరం ఉందని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. నేరం జరిగిన తర్వాత చర్యలు తీసుకోవడం కంటే, నేరాలు జరగకుండా నివారించడమే అత్యంత ముఖ్యమని ఢిల్లీ పోలీసులకు హితవు పలికింది. ఇటీవల ఢిల్లీ–జాతీయ రాజధాని ప్రాంతం (ఎన్‌సీఆర్)లో వరుసగా చోటుచేసుకున్న అత్యాచార ఘటనలపై సుమోటోగా విచారణ చేపట్టిన ధర్మాసనం ఈ కీలక వ్యాఖ్యలు చేసింది. విచారణ సందర్భంగా పోలీసుల పనితీరుపై పలు సూచనలు చేసింది. విచారణ సందర్భంగా జస్టిస్ పార్థీవాలా మాట్లాడుతూ.. "మహిళలపై దాడులకు పాల్పడాలనుకునే దుండగులకు తాము పట్టుబడితే తీవ్రమైన పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందనే భయం ఉండాలి. అలాంటి వాతావరణాన్ని మీరు కల్పించాలి" అని పోలీసులను ఆదేశించారు.

నేరాలను అరికట్టేందుకు నివారణ చర్యలను మరింత బలోపేతం చేయాలని ఈ సందర్భంగా న్యాయస్థానం నొక్కి చెప్పింది. ఢిల్లీలో మహిళల భద్రతకు సంబంధించి పలు నిర్దిష్ట ఆదేశాలను ధర్మాసనం జారీ చేసింది. సమస్యాత్మక ప్రాంతాల్లో బీట్ పెట్రోలింగ్‌ను సమర్థవంతంగా నిర్వహించాలని, వెలుతురు సరిగా లేని ప్రదేశాలను గుర్తించి వెంటనే లైటింగ్ సౌకర్యం మెరుగుపరచాలని సూచించింది. అలాగే, నిఘా వ్యవస్థలను పటిష్ఠం చేయాలని తెలిపింది. దుండగులు, పోకిరీలు ఎక్కువగా గుమికూడే అక్రమ తినుబండారాల కేంద్రాలు, మద్యం దుకాణాలపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించింది. ముఖ్యంగా విద్యాసంస్థల సమీపంలో అమ్మాయిలను వేధించే వారిపై ఉక్కుపాదం మోపాలని స్పష్టం చేసింది. దేశ రాజధాని పరిధిలో మైనర్లపై జరిగిన లైంగిక దాడులతో సహా వరుస అత్యాచార ఘటనల నేపథ్యంలో సుప్రీంకోర్టు ఈ కేసును సుమోటోగా విచారణకు స్వీకరించింది. గతంలో కూడా కోర్టు మహిళల భద్రతపై ఆడిట్ నిర్వహించాలని, ఇతర తాత్కాలిక చర్యలు చేపట్టాలని ఆదేశాలు జారీ చేసిన విషయం తెలిసిందే. తాజా విచారణలో తీసుకున్న చర్యలపై పూర్తి వివరాలతో నివేదిక సమర్పించాలని ఢిల్లీ పోలీసులను ధర్మాసనం ఆదేశించింది.

# రైల్వేలో 99.6 శాతం విద్యుదీకరణ.. అయినా డీజిల్ ఇంజిన్లు ఎందుకంటే..!

భారతీయ రైల్వేలో దాదాపు పూర్తయిన బ్రాడ్‌గేజ్ విద్యుదీకరణ

తొమ్మిదేళ్లలో 63 శాతానికి పైగా తగ్గిన డీజిల్ వినియోగం

వ్యూహాత్మక, విపత్తు అవసరాల కోసం తప్పని డీజిల్ ఇంజిన్లు

షంటింగ్ పనులకు డీజిల్ లోకోమోటివ్‌లే కీలకం

హైడ్రోజన్, ఎల్ఎన్‌జి వంటి ప్రత్యామ్నాయాలపై రైల్వే దృష్టి



భారతీయ రైల్వే తన బ్రాడ్‌గేజ్ నెట్‌వర్క్‌లో 99.6 శాతం విద్యుదీకరణను పూర్తి చేసి చారిత్రక మైలురాయిని అందుకుంది. పర్యావరణ పరిరక్షణ, ఖర్చు తగ్గింపు దిశగా ఇది కీలక ముందడుగు. అయితే, దాదాపు నెట్‌వర్క్ అంతా విద్యుదీకరించినా.. డీజిల్ లోకోమోటివ్‌ల అవసరం మాత్రం తగ్గడం లేదు. భవిష్యత్తులో కూడా వీటిని పూర్తిగా తొలగించే అవకాశం లేదని రైల్వే మంత్రిత్వ శాఖ స్పష్టం చేస్తోంది. ప్రకృతి వైపరీత్యాలు సంభవించినప్పుడు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగితే రైళ్ల రాకపోకలు నిలిచిపోకుండా ఉండేందుకు డీజిల్ ఇంజిన్లు అత్యంత కీలకం. అంతేకాకుండా, దేశ వ్యూహాత్మక అవసరాలు, సరిహద్దు ప్రాంతాలకు సైనిక బలగాలు, సామగ్రిని తరలించడం వంటి సున్నితమైన కార్యకలాపాల్లో డీజిల్ ఇంజిన్లదే ప్రధాన పాత్ర. రైల్వే యార్డులు, సైడింగ్‌లలో బోగీలను జతచేయడం, విడదీయడం (షంటింగ్) వంటి పనులకు కూడా ఇవి తప్పనిసరి. కొత్తగా విద్యుదీకరణ పూర్తికాని మార్గాల్లోనూ వీటినే వినియోగిస్తున్నారు. గత తొమ్మిది సంవత్సరాలుగా విద్యుదీకరణ పనులు వేగవంతం కావడంతో డీజిల్ వినియోగం భారీగా తగ్గింది. 2015–16లో 293 కోట్ల లీటర్ల డీజిల్ వినియోగించగా, 2024–25 నాటికి అది 108 కోట్ల లీటర్లకు పడిపోయింది. అంటే ఏకంగా 63 శాతం తగ్గుదల నమోదైంది. ఒకప్పుడు ఏటా 75 కిలోమీటర్ల మేర సాగిన విద్యుదీకరణ పనులు, 2023–24 నాటికి సంవత్సరానికి 7,188 కిలోమీటర్లకు పెరిగాయి. ఈ విషయంలో స్విట్జర్లాండ్ తర్వాత ప్రపంచంలో భారత్ రెండో స్థానంలో నిలిచింది. ఈ నేపథ్యంలో, కొత్త డీజిల్ లోకోమోటివ్‌ల తయారీ కూడా కొనసాగుతోందని అధికారులు తెలిపారు. భవిష్యత్ అవసరాల కోసం ఎల్ఎన్‌జి (లిక్విఫైడ్ నేచురల్ గ్యాస్), బ్యాటరీ, హైడ్రోజన్ వంటి పర్యావరణ అనుకూల ప్రత్యామ్నాయ ఇంధనాలతో నడిచే ఇంజిన్ల అభివృద్ధిపై కూడా భారతీయ రైల్వే దృష్టి సారించింది.

# సినిమా న్యూస్

## బాలయ్య విలన్‌గా యాంగ్రీ మ్యాన్.. ఈసారైనా సెట్టవుతుందా?



నటసింహం నందమూరి బాలకృష్ణ, బ్లాక్ బస్టర్ డైరెక్టర్ కొరటాల శివ కాంబినేషన్ లో రాబోతున్న ప్రాజెక్ట్ మీద రోజుకో ఇంట్రెస్టింగ్ రూమర్ బయటకు వస్తోంది. లేటెస్ట్ గా ఈ సినిమాలో మెయిన్ విలన్ క్యారెక్టర్ కోసం యాంగ్రీ మ్యాన్ రాజశేఖర్‌ను తీసుకుంటున్నారనే టాక్ ఇండస్ట్రీలో హాట్ టాపిక్‌గా మారింది. ఇదే గనుక నిజమైతే, స్క్రీన్ మీద ఇద్దరు పవర్ఫుల్ యాంగ్రీ స్టార్స్ డామినేషన్ మామూలుగా ఉండదు. హీరోగా తనదైన అగ్రెసివ్ మార్క్ చూపించిన రాజశేఖర్ ను, ఫుల్ లెంగ్త్ నెగెటివ్ రోల్ లో ఇంతవరకు చూసింది లేదు. నిజానికి రాజశేఖర్ కు ఇలాంటి విలన్ ఆఫర్స్ రావడం ఇదేం ఫస్ట్ టైమ్ కాదు. మంచి నెగెటివ్ క్యారెక్టర్ దొరికితే సెకండ్ ఇన్నింగ్స్ స్టార్ట్ చేయడానికి తను రెడీ అని ఆయన గతంలోనే చాలా క్లియర్ గా చెప్పారు. ధృవ సినిమాలో అరవింద్ స్వామి లాంటి స్టైలిష్ విలన్, అరవింద సమేతలో జగపతిబాబు చేసిన పవర్ఫుల్ విలనిజం అంటే తనకు చాలా ఇష్టమని కూడా ఆయన ఓపెన్ అయ్యారు. అయితే రెగ్యులర్ రొటీన్ విలన్ గా మాత్రం చేసేది లేదని తేల్చి చెప్పారు. కాబట్టి ఇప్పుడు కొరటాల శివ ఆయనకు ఎలాంటి షేడ్స్ ఉన్న క్యారెక్టర్ రాశాడన్నదే అసలు పాయింట్. దీనికి తోడు ఈ సినిమాలో బాలయ్య మరోసారి డబుల్ రోల్ లో మెప్పించబోతున్నాడనే ప్రచారం గట్టిగా జరుగుతోంది. తండ్రీకొడుకులుగా రెండు డిఫరెంట్ వేరియేషన్స్‌లో ఆయన కనిపించబోతున్నారని ఇన్ సైడ్ టాక్. కొరటాల శివ సినిమాల్లో హీరో క్యారెక్టర్ ఎంత ఎలివేట్ అవుతుందో, ఆ హీరోను ఢీకొట్టే విలన్ క్యారెక్టర్ కు కూడా అంతే స్ట్రాంగ్ బ్యాక్ డ్రాప్ ఉంటుంది. ఒకవేళ రాజశేఖర్ ఎంట్రీ కన్ఫర్మ్ అయితే, డైలాగ్ డెలివరీలో పీక్స్ చూపించే బాలయ్యకు ఆయన పర్ఫెక్ట్ కౌంటర్ అవుతాడని చెప్పవచ్చు. మరో ఆసక్తికరమైన కనెక్షన్ కూడా ఉంది. గతంలో కేఎస్ రవికుమార్ దర్శకత్వంలో వచ్చిన 'జై సింహా' టైమ్ లోనే, తన సినిమాలో విలన్ గా చేయమని బాలయ్య స్వయంగా రాజశేఖర్ ను అడిగారట.

ఈ విషయాన్ని ఒక ఇంటర్వ్యూలో స్వయంగా రాజశేఖరే బయటపెట్టారు. కానీ అప్పుడు కొన్ని కారణాల వల్ల ఆ కాంబో సెట్ అవ్వలేదు. ఇన్నాళ్ల తర్వాత మళ్ళీ అదే బాలయ్యకు ఎదురుగా రాజశేఖర్ పేరు వినిపిస్తుండటం, అది కూడా కొరటాల లాంటి బ్యాలెన్స్డ్ డైరెక్టర్ చేతిలో పడటంతో ఆ అంచనాలు నెక్స్ట్ లెవెల్ కు వెళ్లాయి. రాజశేఖర్ ట్రాక్ రికార్డ్ చూసుకుంటే, ఈమధ్య ఆయన కూడా కేవలం సోలో హీరో క్యారెక్టర్లకే స్టిక్ అవ్వకుండా, తన ఏజ్ కు సెట్ అయ్యే క్యారెక్టర్ రోల్స్ వైపు షిఫ్ట్ అవుతున్నారు. రీసెంట్ గా 'బైకర్' సినిమాలో హీరో ఫాదర్ గా ఒక సెటిల్డ్ పర్ఫార్మెన్స్ ఇచ్చారు. కొత్తదనమున్న పాత్రలు చేయాలనే ఆకలి ఆయనలో కనిపిస్తోంది. ఇలాంటి రైట్ టైమ్‌లో కొరటాల నుంచి ఒక సాలిడ్ నెగెటివ్ రోల్ పడితే, రాజశేఖర్ ఖాతాలో కూడా జగపతిబాబు రేంజ్ లో ఒక ట్రెండ్ సెట్టింగ్ ఇమేజ్ పడటం గ్యారెంటీ. ఈ క్రేజీ ప్రాజెక్ట్ కు సంబంధించిన ఫస్ట్ షెడ్యూల్ డిసెంబర్ మొదటి వారంలో మొదలయ్యే ఛాన్స్ ఉందని సమాచారం. ఇందుకోసం బాలయ్య సరికొత్త మేకోవర్‌లో కనిపించబోతున్నారట. అయితే విలన్‌గా రాజశేఖర్ పేరును మాత్రం మేకర్స్ ఇంకా అఫీషియల్‌గా అనౌన్స్ చేయలేదు. మరి ఇది ఎంతవరకు నిజమవుతుందో చూడాలి.

## నాగవంశీ మరో'సారీ'.. ఈసారి ఏం చెప్పారంటే?

ఒకసారి డేట్ చెప్పడం.. ఆ తర్వాత వాయిదా వేయడం.. మళ్లీ కొత్త డేట్ పై క్లారిటీ లేకపోవడం.. ఆదర్శ కుటుంబం – హౌస్ నెం.47 మూవీ విషయంలో ఇదే జరుగుతోంది. అక్టోబర్ 9న సినిమా వస్తుందని ఆశించిన వెంకటేష్ అభిమానులకు ఇప్పుడు మరోసారి నిరాశ ఎదురైంది. ఈసారి నిర్మాత నాగవంశీ స్వయంగా సారీ చెబుతూ అసలు కారణాన్ని వివరించారు. వెంకటేష్ లీడ్ రోల్ లో త్రివిక్రమ్ దర్శకత్వంలో తెరకెక్కిన ఫ్యామిలీ ఎంటర్టైనర్ 'ఆదర్శ కుటుంబం – హౌస్ నెం.47. ఆ సినిమాను అక్టోబర్ 9న విడుదల చేయాలని మూవీ టీమ్ మొదట నిర్ణయించింది. అందుకు తగ్గట్టుగానే ఓవర్సీస్ లో బుకింగ్స్ కూడా ఓపెన్ చేశారు. అయితే సినిమా పనులు అనుకున్న సమయానికి పూర్తికాలేదు. ముఖ్యంగా పోస్ట్ ప్రొడక్షన్ పనులు ఇంకా పెండింగ్ లో ఉండటంతో అక్టోబర్ 9న సినిమాను తీసుకురావడం కష్టమని నిర్మాత నాగవంశీ తెలిపారు. హడావుడిగా సినిమాను విడుదల చేయడం కంటే, పూర్తిగా సిద్ధమైన తర్వాతే ప్రేక్షకుల ముందుకు తీసుకురావాలని నిర్ణయించుకున్నామని చెప్పారు. "రీసెంట్ గా కచ్చితంగా వస్తుందని చెప్పాను. యూఎస్ లో బుకింగ్స్ కూడా ఓపెన్ అయ్యాయి. కానీ పోస్ట్ ప్రొడక్షన్ పనులు కాస్త ఆలస్యమయ్యాయి. ఓవర్సీస్




సెన్సార్ కు కూడా ఇవ్వలేని పరిస్థితి వచ్చింది"" అని నాగవంశీ వివరించారు. అయితే కావాలంటే పనులు పుష్ చేసి సినిమా విడుదల చేయొచ్చని.. కానీ అలా చేస్తే మొదటి రోజు ప్రేక్షకులతో కలిసి సినిమా చూసే పరిస్థితి ఉండదని ఆయన అన్నారు. అందుకే రిస్క్ తీసుకోకుండా రిలీజ్ ను పోస్ట్ పోన్ చేసినట్లు చెప్పారు. ఈ సందర్భంగా అక్టోబర్ 9న విడుదల కావాల్సిన ఇతర సినిమాలపై కూడా నాగవంశీ స్పందించారు. తమ మూవీ కోసం ఆ తేదీని దృష్టిలో పెట్టుకుని కొన్ని సినిమాలు ప్లాన్ చేసుకున్నాయని.. చివరి నిమిషంలో వాయిదా వేయడంతో వారికి ఇబ్బంది వచ్చిందని చెప్పారు. అందుకే ఆయా మూవీ టీమ్స్ కు, ముఖ్యంగా వెంకటేశ్ అభిమానులకు సారీ చెబుతున్నానని అన్నారు. అలా అని కొత్త రిలీజ్ డేట్ పై కూడా నాగవంశీ క్లారిటీ ఇవ్వలేదు. అక్టోబర్ 30 అనే తేదీ ప్రచారంలో ఉన్నప్పటికీ అది ఫిక్స్ కాలేదని తెలిపారు. వెంకటేష్ ప్రస్తుతం ఫారిన్ లో ఉన్నారని, ఆయన తిరిగి వచ్చిన తర్వాత మాట్లాడి సరైన తేదీని నిర్ణయిస్తామని చెప్పారు. సినిమా కాపీ పూర్తిగా సిద్ధమైన తర్వాతే డేట్ ప్రకటిస్తామన్న నాగవంశీ, ఇంకా కొన్ని పాటలను విడుదల చేయాల్సి ఉందని తెలిపారు. సినిమా విషయంలో తొందరపడి నిర్ణయం తీసుకోవడం కంటే, అంతా సాటిస్పై చేసేలా కంటెంట్ రెడీ చేయడంపైనే దృష్టి పెడుతున్నామని చెప్పారు. సోషల్ మీడియాలో వస్తున్న ట్రోల్స్ దృష్టిలో పెట్టుకుని జాగ్రత్తగా ప్లాన్ చేస్తున్నామని నాగవంశీ అన్నారు. అలా అక్టోబర్ 9న వస్తుందని ఫిక్స్ అయిన ఆదర్శ కుటుంబం ఎప్పుడు వస్తుందనేది వేచి చూడాలి. కానీ డేట్ కంటే ముందుగా సినిమా కాపీ రెడీ కావడమే ముఖ్యమని నాగవంశీ అంటున్నారు.



తక్కువ హంగులతో కూడిన 'బీజ్-బ్రౌన్' (ఎవఅస్త్రవ-ఎతీశీషఅ) దుస్తులలో బంధవి శ్రీధర్ సహజమైన హుందాతనాన్ని ప్రదర్శిస్తున్నారు. మృదువైన బీజ్ రంగు బటన్-డౌన్ షర్ట్ మరియు చక్కగా కుదిరిన బ్రౌన్ రంగు ట్రౌజర్స్‌లో, ఆమె హుందా అయిన శైలితో ఆకట్టుకుంటున్నారు.

## రష్మిక కొత్త లుక్.. ఆ జాగ్రత్తే కలిసొస్తుందేమో..

నేషనల్ క్రష్ రష్మిక మందన్నను చూస్తే ఇప్పటివరకు గ్లామర్.. క్యూట్ నెస్.. మోడ్రన్ స్టైల్ గుర్తొచ్చేవి. కానీ ఇప్పుడు మాత్రం సుబ్బులక్ష్మి గుర్తొస్తున్నారు! ఒక్క చీర మార్చుకోవడంతో వచ్చిన లుక్ కాదు ఇది.. రోల్ కోసం ఆమె తీసుకుంటున్న ప్రతి చిన్న జాగ్రత్త వల్లనే. కొన్ని రోజుల క్రితం కనిపించిన ఆ లుక్ కు సంబంధించిన ఫొటోలు ఇప్పుడు బయటకు రావడంతో మరోసారి వైరల్ అవుతున్నాయి. ఎం.ఎస్. సుబ్బులక్ష్మి బయోపిక్ లాంచ్ ఈవెంట్ లో రష్మిక రాయల్ బ్లూ పట్టుచీరలో కనిపించిన తీరు నిజంగానే స్పెషల్ గా ఉంది. బంగారు, గులాబీ రంగు బోర్డర్ తో ఉన్న పట్టుచీరకు ట్రెడిషనల్ జ్యువెలరీ, కాసుల పేరు, జుమ్కాలు, ముక్కుపుడక, మల్లెపూలు యాడ్ చేశారు. స్టార్ హీరోయిన్ లా కాకుండా.. పాతకాలం నాటి సంగీత విద్వాంసురాలిలా కనిపించేలా ఆ లుక్ ను డిజైన్ చేశారు. అందులో నీలి రంగు చీర మరింత స్పెషల్ గా నిలిచింది. ఎం.ఎస్. సుబ్బులక్ష్మి గారి స్టైల్ లో నీలి



రంగు చీరలకు ఉన్న గుర్తింపును దృష్టిలో పెట్టుకుని ఆ లుక్ ను ప్లాన్ చేసినట్లు కనిపిస్తోంది. ముక్కుపుడక, వెనక్కి చక్కగా వేసిన కొప్పు, మల్లెపూలు కూడా ఆమె ఐకానిక్ స్టైల్ ను గుర్తుచేస్తున్నాయి. ఆ ఈవెంట్ జరిగి కొన్ని రోజులు అవుతున్నా.. ఇప్పుడు రష్మిక, కాస్ట్యూమ్ డిజైనర్ నీరజ కోన ఆ ఫొటోలను సోషల్ మీడియాలో షేర్ చేయడంతో ఆ లుక్ పై హైప్ పెరిగింది. ముఖ్యంగా ఫొటోల్లో కనిపిస్తున్న లుక్ డీటెయిల్స్‌ను గమనిస్తున్న కొద్దీ.. మేకోవర్ వెనుక ఎంత కేర్ తీసుకున్నారో అర్థమవుతోంది. అయితే రష్మికకు సంబంధించిన మరో లుక్ కూడా అప్పటికే అందరి దృష్టినీ ఆకర్షించింది. లాంఛ్ తర్వాత ఆలయానికి వెళ్లినప్పుడు ఆమె డార్క్ మెరూన్ చెక్స్ పట్టుచీరలో కనిపించారు. చిన్న కమ్మలు, ముక్కుపుడక, పెద్ద కుంకుమ బొట్టుతో సింపుల్ గా ఉన్నారు. భారీ నగలు లేకుండా.. ఒక సాధారణ, పద్ధతైన భారతీయ మహిళలా కనిపించడం లుక్ లో హైలైట్.

## సందీప్ నెక్ట్స్ మాత్రం గట్టిగానే.. ఎందుకంటే..

రీసెంట్ గా వచ్చిన సిగ్మా రిజల్ట్ తో సందీప్ కిషన్ కాస్త డిజప్పాయింట్ అయ్యాడనే చెప్పాలి. బాక్సాఫీస్ దగ్గర ఆ సినిమా ఆశించిన స్థాయిలో వర్కౌట్ అవ్వలేదు. కానీ ఈ గ్యాప్ లోనే సందీప్ తన నెక్స్ట్ ప్రాజెక్ట్ మీద గట్టిగానే ఫోకస్ పెట్టాడు. అదే పవర్ పేట. కృష్ణ చైతన్య డైరెక్షన్ లో రాబోతున్న ఈ సినిమా అవుట్ పుట్ మీద ఇండస్ట్రీ సర్కిల్స్ లో ఓ రేంజ్ పాజిటివ్ టాక్ నడుస్తోంది. సిగ్మా ఇచ్చిన షాక్ ను ఈ పొలిటికల్ డ్రామాతో పక్కాగా కవర్ చేసేలా ఉన్నాడని ఫిల్మ్ నగర్ లో వినిపిస్తున్న మాట. డైరెక్టర్ కృష్ణ చైతన్య ట్రాక్ రికార్డ్ చూసుకుంటే ఆయనకు ఈ రస్టిక్ పొలిటిక్స్ జోన్ వెన్నతో పెట్టిన విద్య. రౌడీ ఫెలో, మొన్నటి గ్యాంగ్స్ ఆఫ్ గోదావరి చూస్తే లోకల్ పొలిటిక్స్, పవర్ గేమ్స్, మనుషుల మధ్య ఉండే ఈగో క్లాషెస్ ను ఆయన ఎంత 'రా'గా డీల్ చేస్తారో అర్థమవుతుంది. గ్యాంగ్స్ ఆఫ్ గోదావరికి టాక్ కాస్త వేరేగా వచ్చినా సరే అందులో క్యారెక్టరైజేషన్స్, సెటప్ కు మంచి మార్కులే పడ్డాయి. ఇప్పుడు పవర్ పేట కోసం మళ్ళీ తన స్ట్రాంగ్ జోన్ లోకే దిగిపోయాడు ఈ డైరెక్టర్. పవర్ పేట ఫస్ట్ లుక్ పోస్టర్ తోనే సినిమా థీమ్ ఏంటనేది క్లియర్ గా హింట్ ఇచ్చేశారు. రక్తం అంటిన చెస్ బోర్డు, పగిలిపోయిన పావులు చూస్తుంటేనే ఇదొక మైండ్ గేమ్ అని తెలుస్తోంది. లవ్, ఆనర్, పొలిటిక్స్ అనే క్యాప్షన్ తో వస్తున్న ఈ సినిమాలో సందీప్ కిషన్ సేనాపతి రవి అనే పవర్ఫుల్ రోల్ ప్లే చేస్తున్నాడు. ఎప్పుడూ లవర్ బాయ్ లేదా యాక్షన్ ఇమేజ్ లో కనిపించే సందీప్ కు, ఇలాంటి ఇంటెన్స్ పొలిటిక్స్ ఉన్న క్యారెక్టర్ పడితే యాక్టింగ్ కు ఫుల్ స్కోప్ దొరికినట్లే. నిజానికి సందీప్ కు ఇప్పుడు అర్జెంట్ గా కావాల్సింది కూడా ఇలాంటి రూటెడ్ సబ్జెక్టే. డిఫరెంట్ జానర్స్ ట్రై చేస్తున్నా థియేటర్ల దగ్గర నిలబడే ఒక సాలిడ్ కమర్షియల్ హిట్ కోసం చాలా కాలంగా వెయిట్ చేస్తున్నాడు. ఈ టైమ్ లో రొటీన్ మాస్ సినిమాలు కాకుండా, ఇలా ఎమోషన్స్, పొలిటికల్ ప్రెజర్ ఉన్న క్యారెక్టర్ ఎంచుకోవడం డెఫినెట్ గా సేఫ్ హిట్ అనే చెప్పాలి. పాత్రలో ఉండే ఇంటెన్సిటీ సందీప్ లోని మరో యాంగిల్ ను బయటకు తీస్తుందని ట్రేడ్ వర్గాలు అంచనా వేస్తున్నాయి. ఈ ప్రాజెక్ట్ కు వెనుక ఉన్న టెక్నికల్ టీమ్ చూస్తేనే బజ్ ఆటోమేటిక్ గా క్రియేట్ అవుతోంది. మెలోడీ బ్రహ్మ మణిశర్మ బ్యాక్ గ్రౌండ్ స్కోర్‌తో మ్యాజిక్ చేయబోతుంటే, మధి లాంటి టాప్ సినిమాటోగ్రాఫర్ విజువల్స్ అందిస్తున్నారు. శ్రీకర్ ప్రసాద్ ఎడిటింగ్ బాధ్యతలు తీసుకున్నారు. 70ఎంఎం ఎంటర్టైన్మెంట్స్ బ్యానర్ నిర్మాణ



విలువల విషయంలో ఎక్కడా తగ్గడం లేదట. మొత్తానికి కంటెంట్ పరంగా, టెక్నికల్ గా స్ట్రాంగ్ గా ఉన్న పవర్ పేటతో సందీప్ ఈసారి గట్టిగానే కొట్టేలా కనిపిస్తున్నాడు.

Printed by:KALICHETI VENKAIAH, KADIVEDU VILLAGE AND POST, CHILLAKURU MANDAL, TIRUPATI Dist, A.P-524410. Published by:KALICHETI VENKAIAH, KADIVEDU VILLAGE AND POST, CHILLAKURU MANDAL, TIRUPATI Dist, A.P-524410. Owned by:KALICHETI VENKAIAH, KADIVEDU VILLAGE AND POST, CHILLAKURU MANDAL, TIRUPATI Dist, A.P-524410. Printed at:SINDHURA DARSINI PUBLICATION, KADIVEDU VILLAGE AND POST, CHILLAKURU MANDAL, TIRUPATI Dist, A.P-524410.
Editor: KALICHETI VENKAIAH, KADIVEDU VILLAGE AND POST, CHILLAKURU MANDAL, TIRUPATI Dist, A.P-524410. Email:SINDHURADARSINI.2023@Gmail.com, Cell:7569677170,RNI/APTEL/2023/87662